



దాచేపల్లి : రామాపురంలో కృష్ణానది ఒడ్డుకు చేరిన నాటు పడవలు

సస్పెన్షన్‌తో సరా?

- సొసైటీల్లో స్వాహాపై చర్యలు శూన్యం
- రికవరీలు లేకపోవడంతో రైతులు లబోదిబో

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రైతుల కోసం.. రైతులకు లబ్ధి చేకూరేలా.. రైతుల సేవలో.. ఉండాల్సిన సహకార సొసైటీలు స్కాంలకు కేంద్రాలుగా మారుతున్నాయి. రైతుల పేరుతో రూ.లక్షల్లో మొత్తంగా రూ.కోట్లలో దోచేసుకుంటున్నారు. అధికారమే అండగా.. అధికారుల సహకారంతో సొసైటీల్లో కుంభకోణాలు వెలుగుచూస్తున్నాయి. వివిధ సంఘాల్లో నిధులు స్వాహా చేసినట్లు విచారణలో వెలుగుచూసినా కఠిన చర్యలు లేవు. దీంతో రైతుల సొమ్ము స్వాహా పరిపాటిగా మారింది. సకాలంలో బాకీలు చెల్లించినా ఇంకా రుణదాతలుగా చూపిస్తున్నారని రైతులు వాపోతున్నారు. గత వైసీపీ హయాంలో పెద్దఎత్తున నిధులు స్వాహా చేసినట్లు అక్రమాలు వెలుగుచూసినా చర్యలు శూన్యంగా ఉన్నాయి. వైసీపీ హయంలో జీడీసీసీబీ, సహకార బ్యాంకులోని కొందరు అధికారుల సహకారంతోనే తాము చెల్లించిన రుణాలను కాజేశారని రైతులు వాపోతున్నారు. రుణాల కుంభకోణాలపై జీడీసీసీబీ విచారణ జరిపినా ఉద్యోగులపై వేటుతో సరిపెడుతుందే కానీ కఠిన చర్యలు తీసుకోవడం లేదు. గత ఐదేళ్లుగా రుణాల పంపిణీ.. వసూళ్లలో జరిగిన అక్రమాలపై విచారణ పేరుతోనే అధికారులు కాలం వెళ్లదీస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రైతుల నుంచి కాజేసిన సొమ్మును సదరు ఉద్యోగుల నుంచి రికవరీ చేసే విషయంలో అధికారులు మీనమేషాలు లెక్కపెడుతున్నారు.



జొన్నలగడ్డ సొసైటీ కార్యాలయం

రైతులు చెల్లించిన రుణాల సొమ్మును అనేక సొసైటీల్లో వారి పేర్లపై జమ చేయకుండా ఆయా ఉద్యోగులు జేబుల్లో వేసుకున్నారు. వాయిదాల చెల్లింపులకు సంబంధించి రసీదు అడిగితే ఇస్తానులే అంటూ దాటవేస్తూ వచ్చారు. రుణాలకు సంబంధించిన ఫైళ్లను కూడా మాయం చేసినట్లు సమాచారం. కొందరు బ్యాంకు అధికారుల సహకారంతోనే ఉద్యోగులు ఇలాంటి అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. స్కాంపై నిగ్గు తేల్చి బాధిత రైతులకు న్యాయం చేసే దిశగా డీసీసీబీ స్పందిస్తున్న తీరు అనుమానాలను రేకెత్తిస్తోంది. ఈ పరిస్థితుల్లో న్యాయం చేయాలని బాధిత రైతులు జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావును కోరుతున్నారు.

జొన్నలగడ్డలో రూ.కోటి స్వాహా

పల్నాడు జిల్లా (మిగతా 6వ పేజీలో)



అమరావతి వద్ద కృష్ణమ్మ పరవళ్లు

..మహోగ్రం

పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

- నదీ తీర గ్రామాల్లో మళ్లీ వరద భయం
- సాగర్ నుంచి 4,09,506 క్యూసెక్కులు విడుదల
- ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు 4,68,720 క్యూసెక్కులు
- రెండో ప్రమాద హెచ్చరికకు చేరువలో ప్రకాశం బ్యారేజీ
- నదిలో గంటగంటకు పెరుగుతున్న వరద.. అధికారులు అప్రమత్తం
- హార్బర్‌లో కొనసాగుతున్న 3వ నెంబరు ప్రమాద సూచక

ఈ మండలాల్లో.. హైఅలర్ట్

నదిలో వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో ముప్పు ఉన్న మండలాల్లో విపత్తుల శాఖ హైఅలర్ట్ ప్రకటించింది. పల్నాడు జిల్లాలో దాచేపల్లి, గురజాల, మాచవరం, మాచర్ల, రెంటచింతల, అమరావతి, అచ్చంపేట, బెల్లంకొండ, క్రోసూరు, సత్తెనపల్లి మండలాలున్నాయి. గుంటూరు జిల్లాలో తాడేపల్లి, తుళ్లూరు, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర మండలాలను అప్రమత్తం చేశారు. బాపట్ల జిల్లాలో కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె, నిజాంపట్నం మండలాలను వరద ముప్పు ప్రాంతాలుగా గుర్తించారు.

దాచేపల్లి, అమరావతి, తెనాలి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం నుంచి 4,10,186 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా నాగార్జున సాగర్ జలాశయం 26 క్రస్ట్‌గేట్ల ద్వారా 4,09,506 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల అవుతుంది. ప్రకాశం బ్యారేజీకి 4,73,065 క్యూసెక్కుల వరద వస్తుండగా మొత్తం 70 గేట్లను ఎత్తి దిగువకు 4,68,720 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగరంలో కలిసేందుకు పల్లపు గ్రామాలు, పొలాలను చుట్టేస్తూ ఉరకలెత్తుతూ కృష్ణమ్మ పరుగులు పెడుతూ ప్రవహిస్తుంది. సాగర్‌తో పాటు పులిచింతల, ప్రకాశం బ్యారేజీల నుంచి వచ్చిన నీటిని వచ్చినట్లుగా అధికారులకు దిగువకు విడుదల చేస్తున్నారు. బుధవారానికి వరద ప్రవాహం 5.5 లక్షలకు చేరే అవకాశం ఉండటంతో ముందస్తు జాగ్రత్తలకు కలెక్టర్ల ఆదేశాలు జారీ చేశారు. ముంపుతో బాపట్ల జిల్లాలో అత్యధిక నష్టం ఏర్పడే పరిస్థితి ఉండటంతో కలెక్టర్ వెంకటమురళి అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రధాన ఘాట్ల వద్ద సిబ్బందిని కాపలా ఉంచారు. వరద ఉధృతికి పంట భూములు భారీగా కోత పడుతున్నాయి. గ్రామాలకు వెళ్లే రోడ్లపైగా, చప్టాలను ముంచేస్తూ కృష్ణమ్మ ప్రవాహంతో కొన్ని లంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎక్కడికక్కడ (మిగతా 6వ పేజీలో)



కొల్లూరు : తిప్పలకట్ట వద్ద కోతకు గురవుతున్న భూములు

జగన్ అప్పులు తీరుస్తూ.. సూపర్‌సిక్స్

- రైతులకు సబ్సిడీలు ఇవ్వడంలో వైసీపీ విఫలం
- వినుకొండ కిసాన్‌మేళాలో మంత్రి అచ్చెన్నాయుడు



కిసాన్‌మేళాలో ట్రాక్టర్ నడుపుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

వినుకొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో జగన్ చేసిన అప్పులు తీరుస్తూనే ప్రజల కు హామీ ఇచ్చిన మేరకు సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో వినుకొండ మార్కెట్‌యార్డులో మంగళవారం నిర్వహించిన మెగా కిసాన్‌మేళాలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. చంద్రబాబు అనుభవంతో మోదీ సహాయంతో అభి వృద్ధి, సంక్షేమం సమపాళ్లలో చేస్తున్నామన్నారు. జగన్ ప్రభుత్వంలో రైతులకు కనీసం రాయితీ యంత్రాలను కూడా ఇవ్వలేదన్నారు. గత ఏడాది పంటలు బాగా పండి రైతులు గిట్టుబాటు ధర లేక అల్లాడుతుంటే ప్రభుత్వం రంగంలోకి దిగి నల్లబర్లీ పొగాకు, మామిడి, వరి తదితర ఉత్పత్తులను కొనుగోలు చేసిందన్నారు. నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లకు రూ.3 వేల కోట్లు, చిత్తూరులో మామిడి పంటకు రూ.300 కోట్లు చెల్లించి రైతులను ఆదుకున్నామన్నారు. ఎప్పుడైనా వైసీపీ ప్రభు త్వం ఇలా రైతులను ఆదుకుందా అని ప్రశ్నించారు. గాలికి పుట్టిన పార్టీ వైసీపీ అన్నారు. నీవు, నీ తాత ఏం చేయలేరని జగన్‌ను మంత్రి హెచ్చరించారు. అధికారం లో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల సమస్యలను పరిష్కరించడంలో టీడీపీ ముందుందన్నారు.

అబద్ధాలతో మైండ్‌గేమ్

వైసీపీ పత్రికలో అబద్ధాలు రాసి జనం మైండ్ మార్చేందుకు జగన్ కుట్రలు పన్నుతూ మళ్లీ జనంలోకి వస్తున్నారని విమర్శించారు. చేసిన అభివృద్ధిపై, ఇచ్చిన హామీలపై చర్చకు తాము సిద్ధమన్నారు. పులివెందులలో జడ్పీటీసీ ఎన్నికల్లో ముప్పై ఏళ్ల చరిత్రను తిరగరాశామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మారెడ్డి, కన్నా లక్ష్మీనారాయణ, చదలవాడ అరవిందబాబు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీశక్తి.. కిటకిట

- మహిళలతో బస్సుల్లో రద్దీ
- మూడు రోజుల్లో 3.17 లక్షల మంది ప్రయాణం
- రోజురోజుకు పెరుగుతున్న మహిళా ప్రయాణికులు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం అమలు చేస్తోన్న స్త్రీశక్తి పథకానికి మహిళల నుంచి విశేష స్పందన కనిపిస్తోంది. ఉచిత ప్రయాణంతో బస్సుల్లో మహిళల రద్దీ నెలకొంది. జిల్లా అంతటా పెద్దఎత్తున మహిళలు ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రారంభమైన స్త్రీశక్తికి తొలి రోజు అంతంతమాత్రంగానే మహిళలు బస్సుల్లో ప్రయాణించారు. ఆ మరుసటి రోజు శనివారం నుంచి బస్టాండ్‌ల్లో మహిళల రద్దీ నెలకొంది. రోజు రోజుకు ఉచిత ప్రయాణం చేసే మహిళల సంఖ్య పెరుగుతోంది. తొలి మూడు రోజుల్లో జిల్లాలో 3,17,754 మంది ఉచిత ప్రయాణం చేసినట్లు జిల్లా రవాణా అధికారి అజితకుమారి మంగళవారం తెలిపారు. రూ1,26,68,999. జీరో టిక్కెట్ల రూపంలో జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ పథకానికి ముందు జిల్లాలో నిత్యం 70 వేల మంది మహిళలు ప్రయాణించగా ప్రస్తుతం వారి సంఖ్య పెద్దఎత్తున పెరిగినట్లు అధికారులు తెలిపారు. ఉచిత ప్రయాణం చేసే మహిళల సంఖ్య 40 నుంచి 70 శాతం వరకు పెరగడం గమనార్హం. విద్యార్థినులు గతంలో నెలవారీ పాసుతో ప్రయాణించేవారు. స్త్రీశక్తితో బస్సు పాస్ నగదు ఆదా అవుతుందని విద్యార్థినులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయినులు, వివిధ పనులకు వెళ్లే వారు స్త్రీశక్తితో రూ.వందల్లో ఆదా అవుతున్నదని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రద్దీతో బస్సులో నిలబడి ప్రయాణించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మహిళల రద్దీకి తగ్గట్టుగా బస్సుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉంది.

జిల్లాలో మహిళల ఉచిత ప్రయాణం వివరాలు ఇలా..

వారం	మహిళల సంఖ్య	టిక్కెట్ల విలువ
శుక్రవారం	5,293	రూ 2.00 లక్షలు
శనివారం	72,150	రూ 27.48 లక్షలు
ఆదివారం	1,10,473	రూ 43.96 లక్షలు
సోమవారం	1,29,838	రూ 52.56 లక్షలు



నరసరావుపేట బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న మహిళలు



బస్సుల వద్ద మహిళల రద్దీ

పుష్కలంగా యూరియా

ఆర్‌ఎస్కేలకు 5,300 టన్నులు



జేడీ జగ్గారావు

నరసరావుపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియాకు కొరత లేదని, పుష్కలంగా నిల్వలు ఉన్నాయని వ్యవసాయశాఖ జేడీ జగ్గారావు తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆర్‌ఎస్కేలకు ఎరువుల సరఫరా ఎప్పుడు.. అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో మంగళవారం వెలువడిన వార్తకు జేడీ స్పందించారు. యూరియా 2,800 మెట్రిక్ టన్నులు, డీఏపీ 2,500 మెట్రిక్ టన్నులు రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేస్తున్నామని, రెండు మూడు రోజుల్లో రైతులకు విక్రయాలు ప్రారంభమవుతాయని చెప్పారు. యూరియా కృత్రిమ కొరత సృష్టించేందుకు వ్యాపారులు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాకు 35 వేల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించగా ఇప్పటి వరకు 17,000 మెట్రిక్ టన్నులు విక్రయించామన్నారు. ఈ నెల, వచ్చే నెలలో జిల్లాకు 15,000 నుంచి 20,000 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కానున్నదన్నారు. అన్ని రకాల ఎరువులు 60 వేల మెట్రిక్ టన్నులు సరఫరా కాగా ఇప్పటి వరకు 21,000 టన్నులు ఖర్చు అయిందన్నారు. నానో యూరియాను పంటలకు వాడాలని సూచించారు. ఎరువులకు సంబంధించిన సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు.

మంగళగిరిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్

- మయూరి టెక్‌పార్కులో ఏర్పాటు 8
- నేడు ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు



మంగళగిరి బైపాస్‌లోని మయూరి టెక్ పార్కు

అంబటి మురళి, జగన్ మీడియాపై కేసు నమోదు 6

నేటి నుంచి కోర్టులో ఉద్యోగాలకు రాత పరీక్షలు

టీడీపీ నేతలపై హత్యాయత్నం కేసు కొట్టివేత



కోర్టు ఆవరణతో న్యాయవాదులతో కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు(లీగల్), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాం ప్రసాద్‌తో పాటు 25 మంది నమోదైన హత్యాయత్నం కేసును కొట్టివేస్తూ గుంటూరు ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎ.కుమిదిని మంగళవారం తీర్పు చెప్పారు. 2021లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల పోలింగ్ రోజు తమపై దాడి చేసి, హత్యాయత్నానికి పాల్పడ్డారంటూ మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, చల్లా శేషిరెడ్డి తదితరుల పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొత్తం 27 మంది టీడీపీ నాయకులపై నమోదైన ఈ కేసును సరైన సాక్షాధారాలతో రుజువు చేయడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని భావించి న్యాయమూర్తి కేసు కొట్టివేశారు.

నేటి నుంచి కోర్టులో ఉద్యోగాలకు రాత పరీక్షలు

గుంటూరు(లీగల్), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కోర్టుల్లో జూనియర్ అసిస్టెంట్, స్టెనో గ్రాఫర్, టైపిస్ట్, ఫీల్డ్ అసిస్టెంట్ , రికార్డు అసిస్టెంట్, ప్రాసెస్ సర్వర్, ఆఫీస్ సబార్డినేట్ , డ్రైవర్ తదితర పోస్టుల్లో నియామకాలకు బుధవారం నుంచి ఈ నెల 24 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. కల్యాణ చక్రవర్తి పలు సూచనలు చేశారు. 15 నిమిషాల ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఐడీ ప్రూఫ్‌తో పాటు హాల్ టికెట్‌ను కచ్చితంగా తీసుకురావాలని పేర్కొన్నారు. హాల్ టిక్కెట్ల డౌన్‌లోడ్‌లో సాంకేతిక సమస్యలు ఎదురైతే, హెల్ప్ డెస్క్ 0863 2372752 నంబరుకు సంప్రదించాలన్నారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఫైనల్ అని వైవా-వోస్ ఉండదన్నారు. నైపుణ్య పరీక్షలు ఉంటాయని తెలిపారు. నైపుణ్య పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థులకు తగిన సమయంలో సమాచారం ఇస్తామని తెలిపారు. నిర్ధారిత వైకల్యం ఉన్నవారు సహాయకుల కోసం అభ్యర్థిస్తే.. ప్రొవిజియో స్క్రైబ్ టీసీఎస్ సెంటర్ ఇన్‌చార్జి నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

ఫిలాటలీ స్కాలర్‌షిప్‌కి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పోస్టల్ శాఖ దీన్ దయాల్ స్పర్ష్ యోజన ద్వారా నిర్వహించే ఫిలాటలీ స్కాలర్‌సిప్స్‌కి 6 నుంచి 9వ తరగతి విద్యార్థుల ఎంపికకు పాఠశాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గుంటూరు పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ ఎలమందయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల పేర్లతో పాఠశాలల నుంచి పోస్ట్ మాస్టర్ జనరల్, విజయవాడ చిరునామాకు సెప్టెంబరు 16వ తేదీ లోపు పంపాలన్నారు. 30న రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి ఫిలాటలీ ప్రాజెక్టు పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నెలకు రూ.500 చొప్పున ఏడాదికి రూ.6 వేలు ఉపకార వేతనం అందిస్తామని తెలిపారు.

21, 22న ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం బోయపాలెంలో ఉన్న శ్రీ అనంతలక్ష్మి స్పిన్నింగ్ మిల్లులో ఈ నెల 21, 22 తేదీల్లో బసవతారకం ఇండో- అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సామినేని చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ సామినేని కోటేశ్వరరావు తెలిపారు. సామినేని చారిటబుల్ ట్రస్ట్, కాకతీయ ఫౌండేషన్ సహకా రంతో అత్యాధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వ్యాధి నిర్ధారణ జరిగితే తెల్లరేషన్ కార్డు ఉన్న వారికి బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తారన్నారు. శిబిరానికి హాజరైన వారికి ఉచిత భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 88865 19121, 99121 17887 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన

● 50 రోజులు విస్తృత ప్రచారం



గుంటూరు మెడికల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై విస్తృత అవగాహన, ప్రచార కార్యక్రమాలను మంగళవారం నుంచి ప్రారంభించారు. గుంటూరు జిల్లాతో సహా రాష్ట్రంలో ఐదు వేల గ్రామాల్లో ఈ ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఆంధ్ర ప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ఏపీ శ్యాక్స్) ఆదేశాల మేరకు జిల్లాలో 50 రోజుల పాటు ప్రచార కార్యక్రామాలు ఉధృతంగా నిర్వహిస్తామని (ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్) జిల్లా ఆరోగ్య శాఖ వర్గాలు వెల్లడించాయి. దేశం లో ఇటీవల జరిగిన సర్వేలో యువతుల్లో 24 శాతం, యువకుల్లో 35 శాతం మందికి మాత్రమే హెచ్‌ఐవీ, ఎయిడ్స్ పట్ల అవగాహన ఉంద ని, మిగిలిన వారికి పెద్దగా అవగాహన లేదని తేలింది. ఈ నేపథ్యం లో ఆగస్టు 12న అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (న్యాకో) నిర్దేశించిన లక్ష్యం మేరకు దేశవ్యాప్తంగా యాభై రోజుల హెచ్‌ఐవీపై అవగాహన, ప్రచార కార్యక్రమాలకు పిలుపు నిచ్చింది. జిల్లాలో అన్ని పాఠశాలలు, కళాశాలల్లో 15 నుంచి 24 ఏళ్ల వయస్సు కలిగిన విద్యార్థులకు వివిధ రూపాల్లో హెచ్‌ఐవీపై అవగాహన కల్పిస్తారు. సోషల్ మీడియా, ఆల్ ఇండియా రేడియో, దూర దర్శన్, ఎఫ్ఎం రేడియో, 12 ప్రధాన రైల్వే స్టేషన్లలో ఆడియో క్లిప్స్, కరపత్రాలు, స్టిక్కర్లు, హోర్డింగ్‌ల ద్వారా ప్రచారం చేస్తారు. జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో మొబైల్ వ్యాన్లు, చంద్రన్న సంచార చికిత్స వాహనాలతో ప్రత్యేక శిబిరాలను నిర్వహించి హెచ్‌ఐవీపై అవగాహన కల్పిస్తారు. కళాశాలల్లో యువతకు హెచ్‌ఐవీపై అవగాహన కల్పించేందుకు రెడ్ రిబ్బన్ క్లబ్‌లను ఏర్పాటు చేస్తారు. కళాశాల విద్యార్థులకు హెచ్‌ఐవీపై వ్యాస రచన, వక్తృత్వం, క్విజ్ తదితర పోటీలను నిర్వహిస్తారు. ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినమైన డిసెంబర్ ఒకటిన జరిగే కార్యక్రమం లో వీరికి బహుమతులు ప్రదానం చేస్తారు.

..మహోగ్రం

(5వ పేజీ తరువాయి)

పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు నదిలో నీటి ప్రవాహాన్ని అంచనా వేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. కరకట్ట పొడవునా గండ్లుపడే ప్రమాదం ఉన్న చోట్ల అధికారులు ఇసుక మూటలు సిద్ధం చేస్తున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాత్రి పూట గస్తీని పెంచారు. లంక భూముల్లోకి ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నారు. బుధవారానికి రెండో ప్రమాద హెచ్చరికకు చేరువలో బ్యారేజీ వద్ద ప్రవాహం పెరిగే పరిస్థితి ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా నిజాంపట్నం హార్బర్‌లో 3వ రోజు మంగళవారం 3వ నెంబరు ప్రమాదసూచిక కొనసాగుతుంది.

పర్యవేక్షిస్తున్న అధికారులు

దాచేపల్లి మండలం పరివాహక ప్రాంతాలైన పొందుగల, రామాపురం, భట్రుపాలెం, కాట్రపాడు, తంగెడ గ్రామాల్లో ఏటీ ఒడ్డున ఉన్న పంట పొలాలు మునిగిపోయాయి. రామాపురంలో నివాస గృహాలను తాకుతూ వరద నీరు ప్రవహిస్తుంది. అమరేశ్వరాలయం పుష్కరఘాట్ వద్ద పది అడుగులు నీటిమట్టం పెరిగితే నీరు అమరావతిలోకి వచ్చే ప్రమాదం ఉండటంతో రెవెన్యూ సిబ్బందిని అధికారులు అప్రమత్తం చేశారు. పెదమద్దూరు వాగుపై వాహనాల రాకపోకలు నిలిపి వేశారు.

9 అడుగుల ఎత్తులో ప్రవాహం..

ఎగువ జలాశయాల కంటే, ప్రకాశం బ్యారేజి క్యాచ్‌మెంట్ ప్రాంతంలో పడిన వర్షాలకు వస్తున్న వరద నీరే ఎక్కువగా ఉంది. మున్నేరు, కీసర వాగుల నుంచి 17,590 క్యూసెక్కులు, పాలేరు నుంచి 5,625 క్యూసెక్కుల వరద నీరు బ్యారేజికి చేరుతోంది. అత్యధికంగా పులిచింతల నీటితో కలిపి వజీనేపల్లి వాగు నుంచి 3,86,730 క్యూసెక్కుల వరద బ్యారేజికి చేరుతోంది. మొత్తంమీద మంగళవారం 4,73,065 క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజికి చేరుకోగా 4,68,720 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బ్యారేజీ 69 గేట్లను 10 అడుగుల మేర పైకి లేపి నీటిని వదులుతుండటంతో నదిలో నీటి ప్రవాహం 9 అడుగుల ఎత్తులో ఉంది. వరద ప్రమాద హెచ్చరికలు మైకు ద్వారా చేశామని, తీరంలోని గ్రామాల్లో వీఆర్వోలు, వీఆర్ఏలు, పోలీసు సిబ్బందిని, నీటిపారుదల శాఖల అధికారులను సమన్వయ పరిచి, ముంపు ఏర్పడే ప్రాంతాలను గుర్తించి, ప్రజలను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ చెప్పారు.

కోల్డ్ స్టోరేజ్‌కు రూ.11.84 కోట్లు



మంజూరు ఉత్తర్వుల పత్రాన్ని అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ఈపూరు, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): ఈపూరు సొసైటీ పరిధిలో కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి రూ.11.84 కోట్లు జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు మంజూరు చేశారు. ఉత్తర్వుల పత్రాన్ని మంగళవారం వినుకొండలో జరిగిన మెగా కిసాన్ మేళలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సమక్షంలో సొసైటీ ఛైర్మన్ విడదలపాటి హనుమయ్యకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రావర్ల జగ్గారావు, సొసైటీ డైరెక్టర్ అయినాల కోటేశ్వరరావు, సీఈఓ పోకా కోటేశ్వరరావు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డిపై కేసు నమోదు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 19, (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే, పల్నాడు జిల్లా వైసీపీ అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డిపై మొదటి పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. సీఐ ఎంవీ చరణ్ వివరాల మేరకు.. ఈ నెల 17న పట్టణంలోని వరవకట్టకు చెందిన రౌడీషీటర్ నాగూర్ వలి జన్మదినం రోడ్డుపై నిర్వహించారు. పబ్లిక్ న్యూసెన్స్ క్రియేట్ చేస్తూ..మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో కేక్ కట్ చేశారు. దీంతో అసౌకర్యానికి గురైన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాగూర్ వలి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మరో 50 మందిపై కేసు నమోదు చేశారు.

పీ-4 అమలుతో అసమానతలకు స్వస్తి : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరిక నిర్మూలనతో పాటు ఏపీ ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పీ-4 పథకం అమలు దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాటలు తప్ప.. చేతలకు పనికిరాని వారే పీ-4ను తప్పుపడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో అట్టడుగున ఉన్న 20 శాతం పేద కుటుంబాలను ఆర్థికంగా ఎదిగేలా చేయాలన్న సంకల్పం దిశగా ప్రభుత్వం సాగుతోందన్నారు. పథకం అమలుతో 2029 నాటికి రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించి, 2047 నాటికి దేశ ఆర్థికాభివృద్ధిలో ఏపీ కీలక భూమిక పోషించాలన్నదే చంద్రబాబు ప్రధాన లక్ష్యమని వివరించారు.

కూటమి ప్రజల మనసులు గెలిచింది

టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజారంజక పాలనతో కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే ప్రజల మనసులు గెలిచిందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సూపర్ 6 అమలుతో అన్ని వర్గాల ఆదరాభిమానాలు పొందిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజల మద్దతుతో రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి పనులు పరుగులు పెట్టిస్తున్నారన్నారు. పరిశ్రమల స్థాపన, పెట్టుబడుల ఆకర్షణతో పాటు మరోపక్క పేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ఆయన ఆలోచనలు వేగంగా అమల్లోకి వస్తున్నాయన్నారు. పీ-4 కార్యాచరణ దిశగా ముఖ్యమంత్రి సన్నద్ధమయ్యారన్నారు. పీ-4 అమలు అసాధ్యమంటూ, పేదరికం ప్రామాణికాలను తప్పు పడుతూ రాష్ట్రంలో కోటికి పైగా పేద కుటుంబాలున్నాయని చెబుతున్న వారు.. గతంలో ఐదేళ్ళు అధికారంలో ఉండి పేదరిక నిర్మూలనకు ఏం చేశారో ఆలోచించుకోవాలన్నారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

రాజుపాలెం ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన గుంటూరు-మాచర్ల రహదారిపై రాజుపాలెం గ్రామ సమీపంలో నర్సరీ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం కందుకూరు గ్రామానికి చెందిన మూడావత్ రమేష్ నాయక్ (45), గుంటూరు పట్టణానికి చెందిన బొర్రా తిరుమలరావు దాచేపల్లి మండలం నడికూడికి మిర్చి గోతాలు కుట్టడానికి వెళ్లారు. పని ముగించుకుని తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. కాటన్ లోడుతో వెళ్తున్న లారీ అతివేగంగా వారిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ.. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ రమేష్‌నాయక్ మృతి చెందగా.. తిరుమలరావును మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు తరలించారు. స్థానిక ఎస్ఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పూడ్చిన బాలుడి శవానికి పోస్టుమార్టం

క్రోసూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కొడుకు మృతిపై తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేయడంతో.. పోలీసులు మంగళవారం పూడ్చి పెట్టిన బాలుని శవాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహించారు. క్రోసూరు మండలం విప్పర్ల గోవిందాపురం కాలనీలోని బావిలో జూన్ 2న గ్రామానికి చెందిన ఎర్రగొండ మౌనియ్య, శ్రావణిల కుమారుడు జోష్ ప్రసాదు(8) మృత దేహం కనిపించింది. అప్పట్లో ప్రమాద వశాత్తు జరిగినట్టుగా అంతా భావించారు. బాలుని మృత దేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఐతే పది రోజుల క్రితం బాలుడి తల్లి శ్రావణి తమ కుమారుడి మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ క్రోసూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలుడిని కొంత మంది వ్యక్తులు చంపి బావిలో వేసినట్టుగా ఫిర్యాదులో పేర్కొంది. ఆమె ఫిర్యాదు మేరకు తహసీల్దార్ వేముల వెంకట నాగరాజు సమక్షంలో బాలుడి మృత దేహాన్ని వెలికి తీశారు. గుంటూరు జనరల్ ఆస్పత్రి డాక్టర్లు బాలుని మృత దేహానికి పూడ్చి పెట్టిన స్థలం వద్దనే పోస్టుమార్టం నిర్వహించారు. పెదకూరపాడు సీఐ పత్తిపాటి సురేష్, క్రోసూరు ఎస్ఐ పి.రవి బాబు ఉన్నారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రవిబాబు తెలిపారు.

రోబోటిక్స్‌పై వర్క్‌షాప్

నరసరావుపేట టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జేఎన్‌టీయూ నరసరావుపేట క్యాంపస్‌లో మంగళవారం రోబోటిక్స్‌పై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌గా ఎస్ఆర్ఎం యూనివర్శిటీ ఆంధ్రప్రదేశ్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వీపీఎస్ ప్రదీప్ వ్యవహరించారు. వర్క్‌షాప్‌కు ముఖ్య అతిథులుగా పలక్కాడ ఐఐటీ నుంచి డాక్టర్ కేఎస్ అరుణ్‌కుమార్, రూర్కీ ఐఐటీ నుంచి డాక్టర్ విట్టలాయ్ రాయంకుల హాజరై ముఖ్య అంశాలపై సమాచారం అందించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఐఎస్ ఫణిసుష్మ, డాక్టర్ ఎం బాలాజీనాయక్, డాక్టర్ జి.సులోచనా సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పలు అంశాలపై ఆసక్తిగా చర్చలు జరిపారు.

సస్పెన్షన్‌తో సరా..

(5వ పేజీ తరువాయి)

పరిధిలోని జొన్నలగడ్డ సొసైటీలో రుణాల కుంభకోణంపై జీడీసీసీబీ విచారణ చేపట్టగా రూ.కోటి స్వాహా అయి నట్లు సమాచారం. రైతులు చెల్లించిన రుణా లు బ్యాంకు జమ చేయకుండా సొసైటీ కార్యదర్శి నంద్యాల వీరారెడ్డి, ఉద్యోగి తనుబుద్ధి కృష్ణారెడ్డి స్వాహా చేసినట్లు విచారణలో అధికారులు తేల్చారు. సదరు ఉద్యోగులను సస్పెండ్ చేసి జీడీసీసీబీ అధికా రులు చేతులు దులుపుకున్నారే కానీ మోసపో యిన రైతులకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవన్న విమర్శలున్నాయి. విచారణ నివేదికను గోప్యంగా ఉంచడంపై అనుమానాలకు తావిస్తోంది.

కొరవడిన పర్యవేక్షణ

సహకార సంఘాల ద్వారా రైతులకు ఏటా రుణాలు పంపిణీ చేస్తారు. ఇందుకు సంబంధించిన జాబితా డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఉంటుంది. ఏటా సొసైటీ రుణాలపై ఆడిట్ చేయాలి. రికార్డులు, రసీదు పుస్తకాలను తనిఖీ చేయాలి. ఈ ప్రక్రియ పూర్తి స్థాయిలో నిర్వహిస్తే రుణాల పంపిణీ, వసూళ్లలో అక్రమాలకు తావు ఉండదు. ఇలాంటి పర్యవేక్షణ లేకపోవడంతో సొసైటీ రుణాలలో అక్రమాలు జరుగుతున్నాయి. సొసైటీల వారీగా ఉన్న బకాయిలపై ప్రత్యేకంగా విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

అంబటి మురళి, జగన్ మీడియాపై కేసు నమోదు

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత అంబటి మురళీకృష్ణ, జగన్ మీడియాపై చేబ్రోలు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో చేబ్రోలు మండలంలో రికార్డు స్థాయిలో 23.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. ఈ ప్రభావంతో మండలంలో పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. ఈ నీట మునిగిన పంట పొలాలను పరిశీలించడానికి ఈ నెల 16న విచ్చేసిన అంబటి మురళీకృష్ణ కొండవీటి వాగు ప్రవాహాన్ని పొన్నూరుపై వదిలివేయడంతోనే పంట పొలాలు నీట మునిగాయని మాట్లాడారు. అంబటి మురళి చేసిన ఈ వ్యాఖ్యలు అసత్యాలని, ఈ వ్యాఖ్యలు ఆధారంగా సాక్షి చానల్‌లో అసత్య కథనాలను ప్రసారం చేశారని దీంతో రైతులు భయభ్రాంతులకు గురై ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు అప్పాపురం చానల్ ఇన్‌చార్జి వెంకటరమణ చేబ్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఈ రమణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటకృష్ణ అంబటి మురళి, జగన్ మీడియాపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

కోడల్ని చంపిన మామకు జీవిత ఖైదు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కుటుంబ వివాదాల నేపథ్యంలో కోడల్ని గొడ్డలితో నరికి హతమార్చినట్లు నేరం రుజువు కావడంతో నిందితుడు ఫిరంగిపురం మండలం, వేమవరం గ్రామానికి చెందిన ధారా యాకోబుకు జీవిత ఖైదు, రూ.10 వేల జరిమానా విధిస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి డాక్టర్ నేతి సత్యశ్రీ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. అచ్చంపేట మండలం గ్రంథ సిరి గ్రామానికి చెందిన చిలుకా సుందర కుమార్తె దారా కోటేశ్వరమ్మతో యా కోబు కుమారుడు శ్యాంబాబుకు 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వేమవరంలో నివసిస్తున్న కోటేశ్వరమ్మ బంధువులతో యాకోబుకు వివాదాలున్నాయి. ఈ నేపథ్యంలో బంధువులతో మాట్లాడొద్దని కోటేశ్వరమ్మకు యాకోబు చెప్పాడు. అనారోగ్యంతో ఉన్న కోటేశ్వరమ్మ బంధువును ఆమె తల్లిదండ్రులు 2019 నవంబర్‌లో పలకరించారు. దీనిని మనసులో పెట్టుకున్న యాకోబు అదే ఏడాది నవంబర్ 11న కోటేశ్వరమ్మను గొడ్డలితో నరికి హతమార్చాడు. మృతురాలి తండ్రి చిలక సుందరరావు ఫిరంగిపురం పోలీసులకు పిర్యాదు చేశారు. ప్రాసిక్యూషన్ ఏపీపీ గుండాల సురేష్ బాబు నిర్వహించారు.

నేడు సీనియర్ సాఫ్ట్‌బాల్ బాలికల జట్టు ఎంపిక

సత్తెనపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా సీనియర్ సాఫ్ట్‌బాల్ సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9 గంటలకు కొమెరపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీనియర్ సాఫ్ట్‌బాల్ బాలికల జట్టు ఎంపిక జరుగుతుందని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సి.సామంత్‌రెడ్డి, ప్రెసిడెంట్ వంశీకృష్ణారెడ్డి, వీసీ మెంబరు సుబ్బారావు మంగళవారం విలేకరులకు తెలిపారు. ఎంపికైన జట్టు ఈ నెల 30, 31 తేదీల్లో కోటప్పకొండలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఎంపికకు వచ్చే బాలికలు ఆధార్ జిరాక్స్ మూడు పాస్ ఫొటోలు తీసుకు రావాలన్నారు. పూర్తి వివరాలకు 77992 24090 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

53,278 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 54,935 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 53,278 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,716 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13500
నెంబరు. 5	10000	13300
273	----	----
341	10000	14700
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14500
షార్క్-1	-----	----
బ్యాడిగి 355	10000	13200
దేవనూరు డీలక్స్	10000	13300
ఆర్మూరు	9800	11200

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13400
నెంబరు. 5	10000	13500
273	----	----
341	11000	14800
4884	10000	12800
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14200
బ్యాడిగి 355	10000	13000
దేవనూర్ డీలక్స్	10500	13500
ఆర్మూరు	----	----
తాలుకాయలు	5000	7200

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

పీఏసీఎస్ పాలక వర్గ ప్రమాణ స్వీకారం నేడు

ముప్పాళ్ళ ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ముప్పాళ్ళ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పాలకవర్గ ప్రమాణస్వీకారం బుధవారం ఉదయం 11 గంటలకు చాగంటివారి పాలెంలోని సాయిబాబా ఆలయంలో జరుగుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. ముప్పాళ్ళ పీఏసీఎస్ చైర్మన్‌గా నార్నెపాడుకు చెందిన జెట్టి నాగమల్లేశ్వరావు ప్రమాణస్వీకారం చేయనున్నారని ఆయన తెలిపారు. మండలంలోని కూటమి శ్రేణులు అధిక సంఖ్యలో ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

కనకదుర్గ అమ్మవారికి లక్ష కుంకుమార్చన



ప్రత్యేక అలంకరణలో శ్రీకనకదుర్గాదేవి అమ్మవారు

గురజాల టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గురజాల పట్టణంలోని కారంపూడి రోడ్డులో ఉన్న శ్రీకనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి శ్రావణ మంగళవారం సందర్భంగా మహిళలు లక్ష కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి పూలతో అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వరి కంకుల అలంకరణలో కనకదుర్గ అమ్మవారు



వరికంకులతో పిడుగురాళ్ల కనకదుర్గ అమ్మవారి అలంకరణ

పిడుగురాళ్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాస నాలుగో మంగళవారాన్ని పురస్కరించుకొని స్థానిక కనకదుర్గ అమ్మవారిని వరి కంకులతో విశేషంగా అలంకరించారు. ఆలయ పూజారి పూర్ణానందశాస్త్రి, దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

శివుడికి అన్నాభిషేకం

పిడుగురాళ్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): చినఅగ్రహారంలో ఉన్న శ్రీగంగా పార్వతి సమేత చంద్రమౌళేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం స్వామి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు దేవస్థానం అనువంశిక అర్చక స్వామి వెల్లటూరి చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో జరిగాయి. స్వామికి రుద్రాభిషేకం, అన్నాభిషేకం, రుద్రహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు.

వీవోఏలు బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

● ఏపీఎం వెంకటరంగారెడ్డి

దుర్గి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వీవోఏలు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఏపీఎం పరిమిరెడ్డి వెంకటరంగారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వీవోఏలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ఎంబుక్ 2.0 కీపింగ్ నిర్వహణపై అవగాహన కల్పించారు. మండలస్థాయిలో సమావేశాలకు ప్రతి ఒక్కరు హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు నరేష్‌రెడ్డి, బంగారయ్య, సైదారావు, శుక్రనాయక్, వీవోఏలు పాల్గొన్నారు.

బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి

గురజాలటౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బైకు అదుపుతప్పి ప్రమాదవశాత్తూ ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన పట్టణంలోని బస్టాండ్ సెంటర్ వద్ద జరిగింది. మండలంలోని గంగవరంనకు చెందిన పర్వతపు భాస్కరాచారి (45) పట్టణంలోని మోటారు మెకానిక్‌గా జీవనం సాగిస్తున్నాడు. కాగా మంగళవారం ఉదయం వివిధ పనుల నిమిత్తం బైకుపై వెళ్తుండగా బస్టాండ్ ప్రాంతంలో ప్రమాదవశాత్తూ బైకు అదుపుతప్పి కిందపడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స నిర్వహిస్తుండగానే భాస్కరాచారి మృతి చెందారు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న భాస్కరాచారి కూడా మృతి చెందడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

● పట్టణ సీఐ ప్రభాకరరావు

మాచర్ల రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు నిబంధనలు అతిక్రమించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ పచ్చిపాళ్ల ప్రభాకరరావు హెచ్చరించారు. పట్టణంలోని బస్టాండ్ సెంటర్ వద్ద మంగళవారం రాత్రి ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడుపుతున్న వాహన చోదకులను గుర్తించి 10 కేసులు నమోదు చేసి రూ.8 వేల జరిమానా విధించారు. మద్యం తాగి, లైసెన్సు, ధ్రువీకరణ పత్రాలు వెంట లేకుండా వాహనాలను నడిపితే సహించేది లేదని హెచ్చరించారు. సీఐ వెంట పట్టణ ఎస్ఐ వెంకట్రావు, సిబ్బంది ఉన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న కొండకోయ వాగు

● తండాకు నిలిచిన రాకపోకలు
● అభివృద్ధికి ఆటంకంగా అటవీ శాఖ అధికారుల నిర్ణయాలు



కంచుగోడు - జడపల్లిమోటు తండాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న కొండకోయ వాగు

అచ్చంపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు మారుతున్నాయి.. కానీ తండాలకు ప్రయాణ సౌకర్యాల్లో మార్పు లేదు.. ప్రతి సంవత్సరం లాగానే కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తే కిలోమీటరు దూరంలో ఉన్న కొండకోయ వాగు పొంగుతుంది. దీంతో గిరిజనులకు కష్టాలు తప్పవు. ఇది అచ్చంపేట మండలం మాదిపాడు పంచాయతీ పరిధిలోని జడపల్లి మోటు తండావాసుల దీన స్థితి..

జడపల్లి మోటు తండాలో సుమారు ఎనిమిది వందల మంది నివసిస్తున్నారు. కృష్ణానది పొంగినప్పుడల్లా లో లెవల్ చప్టాలో ఉన్న కొండకోయ వాగులో నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. నేడు అదే పరిస్థితి దాపురించి ఆస్పత్రికి వెళ్లాలన్నా అవకాశం లేదు. ఈ నేపథ్యంలో ఈ తండా నుంచి మాదిపాడు హైస్కూల్‌కు వచ్చే విద్యార్థుల చదువులు కూడా నిలిచిపోతాయి. నిత్యావసర సరుకులు తెచ్చుకొనేందుకు కూడా మార్గం లేక సతమతమవుతుంటారు. వ్యవసాయం కూడా చాలా వరకు నిలిచిపోతుంది. ఆంధ్రా, తెలంగాణాకు వెళ్లే ఏకైక రోడ్డు మార్గం ఇదే. రెండు రాష్ట్రాల మధ్య ఉన్న ఈ వాగు పొంగటం వల్ల ఈ మార్గం గుండా ఆంధ్రా, తెలంగాణా రాకపోకలు నిలిచిపోయాయి. ఈ వాగుపై 2003లో లో లెవల్ చప్టా నిర్మించారు. 20 సంవత్సరాలుగా ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ ఇదే చప్టాపై రాకపోకలు సాగుతున్న నేపథ్యంలో హైలెవల్ చప్టాగా మార్చేందుకు అధికారులు నిధులు మంజూరు చేశారు. రోడ్డు నిర్మాణం జరుగుతూ ఉంది. ఫారెస్టు అధికారులు హైలెవల్ చప్టాను నిర్మించేందుకు అనుమతులు లేవని అడ్డుకున్నారు. ఈ చర్య వల్ల రోడ్డు నిర్మాణం కొంత వరకు, హైలెవల్ చప్టా పూర్తి స్థాయిలో నిలిచిపోయింది. అటవీశాఖ అధికారుల అడ్డగోలు నిర్ణయాలు గిరిజనులకు శాపమైంది. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్లు పనులు నిలిపి వేశారు. చప్టా లేకపోతే అభివృద్ధికి ఆటంకంగా మారుతుంది. మంగళవారం జడపల్లి మోటు తండాకు చెందిన గర్భిణికి పురిటి నొప్పులు రావటంతో మంచంపై పడుకోబెట్టి ఆమెను జాగ్రత్తగా వాగు దాటించారు. రాజధానికి అనుకొని ఉన్నా కనీస వసతుల్లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఫారెస్టు అధికారులు చొరవ చూపి రోడ్డు మార్గానికి, హైలెవల్ చప్టా నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది.

ప్రకృతి వ్యవసాయంలో వీఏఏలు భాగస్వామ్యం కావాలి

● జిల్లా రిసోర్స్ పర్సన్ కంచర్ల రామచంద్రరావు



ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన వ్యవసాయ శాఖ అధికారులు, వీఏఏలు

ముప్పాళ్ళ ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో వీఏఏలు భాగస్వామ్యం కావాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా రిసోర్స్ పర్సన్ కంచర్ల రామచంద్రరావు అన్నారు. రెండో రోజు సత్తెనపల్లి, పెదకూరపాడు మండలాలకు చెందిన వీఏఏలతో కలిసి అధికారులు వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని నార్నెపాడులో గల ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను అధికారులు మంగళవారం సందర్శించారు. ప్రకృతి వ్యవసాయం 9 సూత్రాల మీద ఆధారపడి ఉంటుందనీ, రైతుసేవా కేంద్రం సిబ్బందికి జిల్లా అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్ శ్రీధర్‌రెడ్డి, జిల్లా డీపీఏ భవాని రాజ్, మాస్టర్ ట్రైనర్ మదుబాబు, వీఏఏలు ప్రకృతి వ్యవసాయ శిబ్బంది పాల్గొన్నారు.

గుర్తింపు కార్డుతో ఈ-క్రాపు నమోదు

క్రోసూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : కౌలు రైతు గుర్తింపు కార్డు ఉన్న రైతులు తమ పేరుతోనే ఈ-క్రాపు నమోదు చేసుకోవచ్చని ఏవో వీ వేణుగోపాల్ అన్నారు. మంగళవారం అందుకూరులో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులతో ఆయన మాట్లాడుతూ గుర్తింపు కార్డుల ద్వారా పంట నమోదు చేయించుకున్న రైతు లు సొంత రైతులకు కలిగే ప్రయోజనాలన్నీ పొందుతారన్నారు. పంటలు వేసిన రైతులందరూ ఈ క్రాపు నమోదు చేయించుకుంటేనే ప్రభుత్వ ప్రయోజనాలు పొందటానికి అర్హులవుతారన్నారు. గ్రామంలోని పత్తి పంటను పరిశీలించి యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది కే శ్రీనివాసరావు, ఎన్ మన్యా నాయక్, రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్త్రీశక్తితో ఆర్టీసీ కళకళ..!



బస్సుల్లో నిలబడి ప్రయాణం చేస్తున్న మహిళలు



బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న మహిళలు

రెంటచింతల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో వారి మోముల్లో హర్షం వ్యక్తమవుతుంది. 15 తేదీ నుంచి బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య పెరిగింది. బస్సుల్లో సీట్లు సరిపోకపోవడంతో నిలబడి పయనిస్తున్నారు. ఆక్యుపెన్సీ రేషియో కూడా బాగా పెరిగింది. మాచర్ల ఆర్టీసీ డిపో వారు 62 బస్సులను స్త్రీశక్తికి కేటాయించారు. రోజు రూ.14 లక్షల నుంచి రూ.15 లక్షలు వచ్చే ఆదాయం సోమవారం రూ.17 లక్షలు దాకా వచ్చినట్లు సమాచారం.

● విజయపురిసౌత్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన నాగార్జున సాగర్, విజయపురిసౌత్‌లో మంగళవారం మాచర్ల వెళ్లే పల్లెవెలుగు బస్సుకు పెద్ద సంఖ్యలో మహిళలు క్యూ కట్టారు. సాగర్ ప్రాజెక్ట్ 26 క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో సాగర్ డ్యాంను సందర్శించేందుకు మహిళా పర్యాటకులు ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో సాగర్‌కు తరలివస్తున్నారు. ఉచితంగా బస్సుల్లో ప్రయాణించడం ఆనందంగా ఉందని మహిళలు పేర్కొన్నారు

స్వమిత్వతో గృహాల శాశ్వత యాజమాన్య హక్కు పత్రాలు



నరసింగపాడులో స్వమిత్వ సర్వేలో కేవీఎస్ ప్రసాదు, కే అప్పారావు, సచివాలయ ఉద్యోగులు

నకరికల్లు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఇంటికి శాశ్వత యాజమాన్య హక్కు పత్రాలను ఇచ్చేందుకు స్వమిత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ ఎంపీడీవో కేవీఎస్ ప్రసాదు తెలిపారు. మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో ఖాళీ స్థలాలకు, గృహాలకు ఈ యాజమాన్య హక్కు పత్రాలను ఉచితంగా అందజేస్తున్నట్టు కేవీఎస్ ప్రసాదు తెలిపారు. మంగళవారం నరసింగపాడులో స్వమిత్వ కార్యక్రమంలో పీఎస్ కొమ్మవరపు అప్పారావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత వైద్య సేవలు అందించటమే లక్ష్యం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నేతలు బ్రహ్మయ్య, రమేష్, ఆంజనేయులు తదితరులు

పెదకూరపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ విశేషంగా కృషి చేస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య అన్నారు. మండలంలోని తమ్మవరంలో మంగళవారం కాటూరి మెడికల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల నేతలు అర్తిమళ్ళ రమేష్, తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, బాజీ సలాం, షేక్ అబ్దుల్లా, కీలం నాగేశ్వరరావు, ఘంటా రాంబాబు, మల్లేశ్వరరావు, షేక్ నన్నేసా, షేక్ గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాల నిర్ధారణ వైద్యశిబిరం రేపు

మాచర్ల రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యాన ఈనెల 21వ తేదీన పట్టణంలోని సెయింట్ ఆన్స్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎంఈవోలు అనిల్ కుమార్, రవికుమార్‌లు తెలిపారు. శిబిరానికి వచ్చే వారు రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, సదరన్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, రేషన్‌కార్డు జిరాక్స్‌లు తీసుకురావాలన్నారు. వివరాలకు 9959126142, 9666270018ను సంప్రదించాలన్నారు.

సంచారజాతుల వారికి ప్రత్యేక గుర్తింపు కావాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశికుమార్

కారంపూడి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సంచారజాతుల వారి సమస్యలు తెలుసుకొని వారికి ప్రత్యేక గుర్తింపు తెచ్చేలా చర్యలు తీసుకోబోతున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్ అన్నారు. మంగళవారం రాత్రి వినుకొండ నుంచి పిడుగురాళ్ల వెళ్తూ మార్గంమధ్యలోని కారంపూడిలో గల బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దేశంలో 1400 సంచార జాతులు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో 64 రకాల సంచార జాతులు ఉన్నాయన్నారు. వీరిని కలిసేందుకు వచ్చామన్నారు. ఈనెల 31వ తేదీన విజయవాడలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆధ్వర్యాన సంచార జాతులతో సమీక్ష నిర్వహించనున్నారని, వారి జీవనశైలిని తెలుసుకోనున్నారని అన్నారు. పల్నాడులోని సంచార జాతులను కలిసి వారిని సమావేశానికి ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు.

బార్ షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

● ఎక్సైజ్ సీఐ వెంకటరమణ

మాచర్లటౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మూడు సంవత్సరాల కాలపరిమితితో బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహించుకొనుటకు లైసెన్సు దారులను ఆహ్వానిస్తూ ప్రభుత్వం నూతన పాలసీని ప్రకటించిందని ఎక్సైజ్ సీఐ వెంకటరమణ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మాచర్ల మున్సిపాలిటి పరిధిలో 4 బార్ అండ్ రెస్టారెంట్లకు దరఖాస్తు కోరుతున్నట్లు చెప్పారు. ఒకొక్క దరఖాస్తుకు రూ.5 లక్షలు చెల్లించి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు నరసరావుపేట ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

సత్తెనపల్లికి నాలుగు బార్ షాపులు

సత్తెనపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నాలుగు బార్ షాపులు ఏర్పాటు చేయటానికి అవకాశం ఉందని ఎక్సైజ్ సీఐ పీ విజయకుమార్ తెలిపారు. మంగళవారం ఎక్సైజ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బార్ షాపుల కోసం ఈనెల 26వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. నూతన బార్‌పాలసీ ప్రకారం నాన్ రిఫండబుల్ అప్లికేషన్ ఫీజు రూ.5 లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు రూ.10 వేలు ఉంటుందన్నారు. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చని, ఎన్ని బార్ లైసెన్స్‌లైనా పొందవచ్చన్నారు. ఈనెల 28వ తేదీన కలెక్టర్ కార్యాలయంలో బార్ లైసెన్స్ దారుల ఎంపిక లాటరీ విధానంలో జరుగుతుందని ఆయన తెలిపారు. పూర్తి సమాచారం కోసం 7674922228, 7702877026 నెంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

వృథాగా పోతున్న మంచినీరు

● పట్టించుకోని పంచాయతీ సిబ్బంది



వృథాగా పోతున్న నీరు

కారంపూడి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కారంపూడిలోని వినుకొండ రోడ్డులో పంచాయతీ వాటర్ పైపులు లీకు కావడంతో రోజూ వందల లీటర్ల మంచినీరు వృథా అవుతోంది. ఇప్పటికే పలుమార్లు గ్రామస్థులు సంబంధిత పంచాయతీ సిబ్బందికి ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. జలవనరుల కొరత తీవ్రంగా ఉన్న ఈ కాలంలో ఇలా నీరు వృథా కావడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీటి వనరులను కాపాడుకోవడం అందరి బాధ్యత అయినప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహించడంపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే లీకేజీ పైపుల మరమ్మతులు నిర్వహించి నీటి వృథాను నివారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పాల ఉత్పత్తి దారులకు బోనస్ పంపిణీ



పాల ఉత్పత్తి దారులకు బోనస్ నగదును అందిస్తున్న శేషగిరి కుమారి

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భట్లూరు సంగం డెయిరీ పాల ఉత్పత్తి దారులకు బోనస్ పంపిణీ కార్యక్రమం మంగళవారం రాత్రి జరిగింది. 150 మంది రైతులకు 74,741 బోనస్ నగదును సంగం డెయిరీ డైరెక్టర్ పోపూరి శేషగిరి కుమారి పంపిణీ చేశారు. వందకు నాలుగు రూపాయల చొప్పున బోనస్‌ను అందించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో రెంటపాళ్ళ బీఎంసీ మేనేజర్ టీ గోపీ, సూపర్‌వైజర్ కోటేశ్వరరావు, పోపూరి యతీష్, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక రేట్లకు అమ్మితే కఠిన చర్యలు

బెల్లంకొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎరువులు అధిక రేట్లకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈవో అరుణకుమారి పేర్కొన్నారు. మంగళవారం బెల్లంకొండ ఎరువుల దుకాణంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారమే ఎరువులను విక్రయించాలని, అలా కాకుండా అధిక రేట్లకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోండి

● ఎంపీడీవో

మాచవరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రభుత్వం అనర్హులుగా ప్రకటించిన దివ్యాంగులు అర్హులమని భావిస్తే రీ వెరిఫికేషన్ కోసం అర్జీలు సమర్పించుకోవాలని ఎంపీడీవో విష్ణు చిరంజీవి మంగళవారం తెలిపారు. రెండు మూడు నెలల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులను పరీక్షలు చేసి కొంత మందిని అనర్హులుగా ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా ప్రభుత్వం వారందరికీ మరోసారి అవకాశం ఇస్తూ రీ వెరిఫికేషన్ కోసం ఎంపీడీవో కార్యాలయంలో సంబంధిత పత్రాలతో అర్జీలు సమర్పించుకోవాలని ఆయన తెలిపారు.

ఈకేవైసీ నమోదు చేసుకోండి

రెంటచింతల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులు ఈ నెల చివరి నాటికి చేయించుకోవాలని తహసీల్దార్ డి.మేరి కనకం కోరారు. ఈకేవైసీ చేయించుకోకపోతే నిత్యావసర సరుకులు నిలిచిపోతాయన్నారు. చౌకధరల దుకాణాల డీలర్లు కూడా తమ బ్యాంక్ ఖాతా వివరాలను తహసీల్దార్ కార్యాలయంలో నమోదు చేయించుకోవాలన్నారు.

నెమలికల్లు-మండెపూడి రోడ్డుకు మరమ్మతులు



కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న పీఆర్ ఏఈ రమేష్

అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని నెమలికల్లు నుంచి మండెపూడి వెళ్లే బీటీ రోడ్ ఇటీవల వరదల వల్ల కోతకు గురికావడంతో విద్యార్థుల కోసం వేస్తే వరదలతో కొట్టుకుపోయింది అని ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ స్పందించి పంచాయతీ ఏఈ రమేష్ బాబును పిలిపించి త్వరగా రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఏఈ రమేష్ రహదారి కోతకు గురైన ప్రదేశాన్ని సందర్శించి బుధవారం ఉదయం నుంచి మరమ్మతులు చేపడతామని తెలియజేశారు. సుమారు వంద మంది విద్యార్థులు ఈ రహదారిపైన మండెపూడి స్కూల్‌కు వెళ్లాల్సి ఉంది. విద్యార్థుల అవసరాన్ని గుర్తించిన ఎమ్మెల్యే మరమ్మతుల పనులు సత్వరం ప్రారంభించాలని ఆదేశించినట్లు ఏఈ రమేష్ తెలిపారు.

అధిక వర్షంతో పత్తి రైతులకు భారీ నష్టం



వర్షానికి తడిసిన పగిలిన పత్తి

దుర్గి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. పంట చేతికొచ్చే సమయానికి వర్షాలు పడుతుండడంతో పత్తి బాగా తడిచి మొక్క రావడంతో నష్టం మిగిల్చింది. ధర కూడా పడిపోవడంతో పెట్టుబడి అయినా వస్తుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు. అధిక వర్షాలకు పత్తి పొలాలు తెగుళ్లు ఆశించి దిగుబడి పడిపోయింది. కొంత అయిన పంట చేతికి వస్తుందనే సమయంలో ఈ వర్షాలు రైతుల ఆశలపై నీరు చల్లాయి. ముదురు పత్తికి ఈ వర్షం తీవ్ర నష్టం మిగిల్చింది. ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

అమరేశ్వరుడి సన్నిధిలో సినీ నటుడు భవానీచౌదరి



కుటుంబ సభ్యులతో కలసి అమరేశ్వరాలయం సందర్శించిన భవానీ చౌదరి

అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు సూర్యదేవర భవానీచౌదరి కుటుంబ సమేతంగా మంగళవారం ఉదయం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వర దేవస్థానం సందర్శించి స్వామిని దర్శించుకున్నారు. భవానీచౌదరి పేరుమీద అర్చకుడు పూజలు నిర్వహించి ఆశీర్వచనం తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భవానీ ప్రసాద్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ తన మాతృమూర్తి లక్ష్మీ వాసిరెడ్డి వారి ఆడపడుచు అని వారి పూర్వీకులు కట్టించిన అమరేశ్వ రాలయం సందర్శించడం ఆనందంగా ఉందని అన్నారు.

ఆలయంలో చోరీ

సత్తెనపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేణుగోపాల స్వామి దేవస్థానంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. మంగళవారం ఆలయానికి వచ్చిన పూజారి చోరీ జరిగిన విషయాన్ని గుర్తించారు. చోరీకి వచ్చిన దుండగులు ఆలయంలోని పుటేజ్‌కు సంబంధించిన వైర్లు కట్ చేసి స్వామి వారి హుండీని పగల గొట్టి సుమారు రూ.30 వేలు నగదు అపహరించుకు వెళ్లారు. ఈ సంఘటనపై దేవదాయ శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీమ్ కూడా వివరాలు సేకరించింది.

ఆరుగురిపై కేసు

రెంటచింతల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పొలం వెళ్లడానికి డొంకరోడ్డు ఉన్నప్పటికీ తమ పొలంలో నుంచి అక్రమంగా వెళ్తున్నారని పాలువాయి గ్రామానికి చెందిన శ్రీరామదాసు మాధవి సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున మంగళవారం తెలిపారు.

అందుబాటులో ఎరువులు

నకరికల్లు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నకరికల్లులో 1614.92 మెట్రిక్ టన్నులు ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏవో కే దేవదాసు మంగళవారం తెలిపారు. ఏపీ మార్క్‌ఫెడ్, పీఏసీఎస్‌ల ద్వారా, రైతు సేవా కేంద్రాల ద్వారా మూడు వందల టన్నుల యూరియా, రెండు వందల టన్నుల డీఏపీ, 50 టన్నుల పొటాష్ రెండు రోజుల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. మంగళవారం నకరికల్లులోని జీడీసీఎంఎస్ కేంద్రంలో ఉన్న ఎరువుల నిల్వలను పరిశీలించారు.

కమిషనర్‌కు సన్మానం

మాచర్లటౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబును పురపాలక సంఘ కార్యాలయం, రెవెన్యూ సిబ్బంది సన్మానించారు. ఉత్తమ కమిషనర్‌గా కలెక్టర్ అవార్డు అందుకున్న సందర్భంగా ఆయనను మంగళవారం సన్మానించారు.

- చవితి పూజలకు గణనాథుడి ప్రతిమలు..
- గతం కంటే మిన్నగా కమిటీల ఏర్పాట్లు



ఘననాథ

తెనాలి రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గణనాథుడు.. ఈసారి చవితి వేడుకల్లో మరింత ఘనంగా కనపడనున్నాడు. విఘ్నాలు తొలగించే వినాయక స్వామి ప్రతిమలను కొలువుదీర్చి.. పూజలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి. వరసిద్ధుడి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిపేందుకు చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా..అంతా ఏకమై పోటీ పడుతున్నారు. మరో వారంలో రానున్న వినాయక చవితి ఉత్సవాల నిర్వహణ ఖర్చు.. ఈ ఏడాది అదనం కానుంది. గణనాథుడి విగ్రహాల ధరలు పెరగడంతో పాటు.. మండపం డెకరేషన్ ఖర్చులు కూడా బాగానే పెరిగాయి. విగ్రహాన్ని మండపంలో ఏర్పాటు చేసిన నాటి నుంచి తొమ్మిది రోజుల పాటు నిర్వహించే పూజ సామగ్రి ఇతర ఖర్చులు కూడా అధికమవుతున్నాయి. వినాయకుడి బొమ్మల తయారీకి ప్రసిద్ధి చెందినది తెనాలి పట్టణం. తెనాలి - గుంటూరు రోడ్డులోని చెంచుపేట - అంగలకుదురు వద్ద కళాకారులు బొమ్మలను తయారు చేస్తున్నారు. తెనాలి, వేమూరు, చుండూరు, చేబ్రోలు, పొన్నూరు, దుగ్గిరాల, అమర్తలూరు, కొల్లిపర మండలాల్లోని గ్రామాలకు చెందిన గణేష్ ఉత్సవ కమిటీల సభ్యులు వీరిని సంప్రదిస్తున్నారు. ఇప్పటికే వివిధ ఆకృతుల్లో గణనాథుడి విగ్రహాలను తయారు చేసి ఉంచారు. ఎత్తు, ఆకారాన్ని బట్టి ధర నిర్ణయించి ఆర్డర్లు బుక్ చేసుకుంటున్నారు.



చవితి ఉత్సవాలకు రూపుదిద్దుకుంటున్న వినాయకస్వామి ప్రతిమలు

విగ్రహాలకు డిమాండ్

విగ్రహ తయారీ ముడి సరుకుల ధరలు పెరగడంతో.. గతేడాది కంటే ఎత్తును బట్టి ఈసారి విగ్రహాల ధర కూడా రూ. 2 వేలు పెరిగింది. దీంతో కమిటీ సభ్యులు ధరలు కాస్త తగ్గించాలని కోరుతున్నారు. తాము పడుతున్న శ్రమను గుర్తించాలని కళాకారులు చెబుతుండటంతో.. ఇక వారు కూడా వెనుకాడడం లేదు. రూ. 5 వేల నుంచి రూ.50వేల వరకూ వివిధ రకాల సైజుల్లో వినాయక స్వామి ప్రతిమలను తయారు చేసి ఉంచారు. ఇప్పటికే 70 శాతం విగ్రహాలను బుక్ చేసుకున్నారు.

- పెరిగిన విగ్రహాల ముడి సరుకు ధరలు
- ఇప్పటికే 70 శాతం విగ్రహాల బుకింగ్



మంగళగిరిలో రతన్ టాటా
ఇన్నోవేషన్ హబ్

- మయూరి టెక్‌పార్కులో ఏర్పాటు
- నేడు ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

ప్రతి కుటుంబంలో ఒక వ్యాపారవేత్త

రాష్ట్ర ప్రభుత్వం జాతీయ, అంతర్జాతీయంగా ఉత్తమ విధానాలను ఉపయోగించి ఒక శక్తిమం తమైన స్టార్టప్ పర్యావరణ వ్యవస్థని నిర్మిస్తోంది. సాంకేతిక పురోగతులు, మార్కెట్ మార్పులు, స్టా ర్టప్‌లు అభివృద్ధి చెందుతున్న అవసరాల నుంచి ఉత్పన్నమయ్యే సవాళ్లను అధిగమిస్తూ అంది వచ్చిన అవకాశాలను సమర్థంగా వినియోగించు కోవడానికి రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, దానికి అనుబంధంగా జోనల్ సెంటర్లను ఏర్పాటు చేసిం ది. ఇందుకోసం ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్, స్టార్టప్ పాలసీ 2024-29ని కూడా ప్రారంభించింది. రాష్ట్రంలోని ప్రతీ కుటుంబంలో ఒక వ్యాపా రవేత్త ఉండాలన్న లక్ష్యానికి అనుగుణంగా దీర్ఘకాలిక దృష్టితో ఈ పాలసీని రూపొందించింది.

మంగళగిరి, గుంటూరు ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో సరికొత్త ఆవిష్కరణల సంస్కృతిని ముందుకు తీసుకెళ్లడానికి, వినూత్న స్టార్టప్‌లు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఊతమిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్(ఆర్‌టీఐహెచ్) ఏర్పాటు చేసింది. మంగళగిరిలోని ఎన్‌హెచ్-16 పక్కన, జనసేన కార్యాలయానికి సమీపాన మయూరి టెక్ పార్కులో ఈ హబ్‌ని బుధవారం సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారు. ఈ హబ్‌కు అనుబంధంగా రాష్ట్రంలోని విశాఖప ట్టణం, రాజమహేంద్రవరం, ఎన్‌టీఆర్, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో రీజినల్ సెంటర్‌లు ఏర్పాటు అయ్యాయి. వీటిని వర్చువల్ విధానంలో మంగళగిరిలోని ఆర్‌టీఐహెచ్ నుంచి ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. ఇందుకోసం మయూరి టెక్ పార్కులో చేసిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మంగళవారం సాయంత్రం వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. మయూరి టెక్‌పార్కులోని నాల్గవ అంతస్తులో సుమారు 53 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ హబ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో ఇంటీరియర్స్ అభివృద్ధి, ఇతరత్రా ఎలక్ట్రికల్ పనుల పూర్తి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.13.96 కోట్లను ఖర్చు చేసింది. రాష్ట్రంలో నూతన ఆవిష్కరణలు, రానున్న అయిదేళ్లలో లక్ష మంది యువతకు ఉద్యోగవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

ఆర్‌టీఐహెచ్ నిర్మాణం, నిర్వహణ..

గత ఏప్రిల్ నెలలోనే ప్రభుత్వం ఈ ఆర్‌టీఐ హెచ్‌ని ప్రకటించింది. అమరావతిలో సెంట్రల్ హబ్ ఏర్పాటుతో స్టార్టప్‌లు, ఇతర సంస్థలకు ఇది మూల స్తంభంగా ఉంటుంది. సెంట్రల్ హబ్‌తో పాటు రీజనల్ సెంటర్లకు నిధులు సమకూర్చడం, వాటిని నిర్వహించడాన్ని ప్రైవేట్ సెక్టార్ చూసుకొంటుంది. ప్రభుత్వం ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ సీఈవో ద్వారా మూలధనం, నిధులు సమకూరుస్తుంది. ఆర్‌టీఐహెచ్, రీజనల్ సెంట ర్లకు పరిపాలకులుంటారు. ఒక ప్రమోటర్ (అధ్యక్షుడు) ఆర్‌టీఐహెచ్‌కు ఉంటారు. కో-ప్ర మోటర్లు, స్వతంత్ర కలిగిన నిపుణులు, ప్రభు త్వం, విద్యా సంస్థలు, పారిశ్రామిక అసోసియేషన్ల నుంచి ఇద్దరు ముఖ్యమైన వ్యక్తులు ఉంటారు. స్టార్టప్‌లకు ఆర్‌టీఐహెచ్ పెట్టుబడి, ఫైనాన్సింగ్, భాగస్వామ్యాలు, ఇంక్యుబేషన్, స్టేక్ హోల్డర్ మేనేజ్‌మెంట్, అకౌంటింగ్, మార్కెటింగ్ అండ్ కమ్యూనికేషన్లు వంటివి కల్పిస్తుంది. ఈ హబ్ వలన దేశంలోని వివిధ సంస్థలు అమరావతి వైపు చూస్తాయని అధికారవర్గాలు తెలిపాయి. కాగా వివిధ కంపెనీలు రూపొందించిన రోబోలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.



కంపెనీలు రూపొందించిన రోబోని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రముఖ సంస్థల భాగస్వామ్యం

రాష్ట్రంలో సిలికాన్ వ్యాలీ తరహా ఎకో సిస్టంను అభివృద్ధి చేయడానికి ఈ హబ్‌లను రూపొందిస్తున్నారు. ఇందులో టాటా గ్రూపుతో పాటుగా ఎల్‌అండ్ టీ, రేమండ్, బిట్స్, అదానీ పోర్టు, ఓఎన్‌జీసీ, గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వంటి ఎన్నో ప్రముఖ సంస్థలు భాగస్వాములుగా ఉంటాయి. సాంకేతిక రంగంలో సరికొత్త ప్రాజెక్టులను ఆవిష్కరించే యువ మేధావులను ఈ హబ్‌లకు తీసుకొచ్చి .. మరింత శిక్షణ, ప్రోత్సాహాన్ని అందిస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో మూడు వేల వరకు స్టార్టప్‌లు పనిచేస్తున్నాయి. వీటి సంఖ్యను వచ్చే అయిదేళ్లలో 20 వేలకు పెంచడం ద్వారా లక్ష మంది యువతకు ఉద్యోగవకాశాలను కల్పించాలన్నదే ప్రధాన ధ్యేయం. యువతలో వ్యక్తిత్వ వికాసం, పోటీ తత్వాన్ని పెంచడంతోపాటు వారిలో నైపుణ్యాభివృద్ధి మరింత వికసించేలా ఇన్నోవేషన్ హబ్ పనితీరు ఉండబోతోంది. క్వాంటమ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వంటి వాటిల్లో స్టార్టప్‌లకు ఈ హబ్ సహకారాన్ని అందిస్తుంది. వ్యవసాయం, అనుబంధ రంగాలు, ఆక్వా, మెరైన్ రంగాల్లోనూ విశేష సేవలను అందించే అవకాశాలున్నాయి.

చెరువుజమ్ములపాలెంలో వర్షపు నీటి నుంచి బయటపడుతున్న వరి పైరు



వెద పైరు మునిగి..
నారు ధర పెరిగి!

బాపట్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు వెదపెట్టిన వరి పొలాలు మొత్తం నీట మునిగి పైరు దెబ్బతింది. దెబ్బతిన్న పొలాల్లో తిరిగి నాట్లు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. దీంతో వరి నారుకు డిమాండ్ పెరిగింది. మళ్లీ నారు పోసి పెంచడానికి ఆలస్యమవుతుందని రైతులు భావిస్తున్నారు. మెరక భూముల్లో పెంచిన వరి నారు కొనుగోలుచేసి తెచ్చుకుంటున్నారు. వర్షానికి ముందు సెంటు నారు వెయ్యి రూపాయలకే వీకి బండికి వేసేవారు. ఇప్పుడు రూ.1600 నుంచి రూ.2వేల వరకు తీసుకుంటున్నారు. గరువు మెరక భూముల్లో నారు పెంచిన సన్న, చిన్నకారు రైతులు నారు ధర పెరగడంతో ఆనందంగా ఉన్నారు. నియోజకవర్గంలోని కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం, ఎం.వి.రాజుపాలెం, కొత్తనందాయపాలెం, పాతనందాయపాలెం, ఏట్రవారిపాలెం, యాజలి, బిడారుదిబ్బ, దిండువారిపాలెం, చందోలు, రాంభొట్లవారిపాలెం, చెరుకుపల్లి పరిసరప్రాంతాల్లో వరినారు విస్తారంగా పెంచారు. గతంలో వరి నారు పెంచిన రైతులు.. ఈ ఏడాది డిమాండ్ ఉండదని వేరుశనగ సాగు చేస్తున్నారు. తక్కువమంది నారు కట్టడం కూడా డిమాండ్‌కు ఒక కారణంగా చెప్పవచ్చు. కొంత మంది రైతులు పొలాలు దున్ని పూర్తిగా వరి నాట్లు వేస్తుండగా.. మరికొందరు దెబ్బతిన్న ప్రాంతంలో మాత్రమే నాట్లు వేస్తున్నారు.



నర్రావారిపాలెంలో నారు తీసుకెళ్తున్న రైతులు

జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌కు సాదియా

ఆర్థికసాయం అందించిన మంత్రి నారా లోకేశ్

మంగళగిరి సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మంగళగిరికి చెందిన అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ షేక్ సాదియా అల్మాస్ జూనియర్ వరల్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైంది. ఈ పోటీలు కోస్టారికా దేశంలోని శాన్‌హోసే నగరంలో ఈ నెల 25 నుంచి సెప్టెంబరు 5వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ అందించారు. చాంపియన్‌షిప్‌లో పాల్గొనడానికి ఆర్థిక సహకారం అందించాలని సాదియా ఇటీవల మంత్రి లోకేశ్‌ను కలిసి కోరారు. తక్షణమే స్పందించిన మంత్రి లోకేశ్ ఫ్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరిట స్థానిక నేతల ద్వారా రూ.2.50 లక్షల సాయాన్ని మంగళవారం సాదియా అల్‌మాస్‌కు అందజేశారు. అడిగిన వెంటనే సాయం అందించిన మంత్రి లోకేశ్‌కు సాదియా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. సాదియా మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్ అందిస్తున్న సహకారం మరువలేనని, గతంలో కూడా ఆయన రూ.3 లక్షల సాయం అందించి ప్రోత్సహించారని గుర్తుచేశారు. టీటీడీ పాలక మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, మంగళగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్, టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పడవల మహేష్, షేక్ రియాజ్, ఉపాధ్యక్షురాలు వాసా పద్మ, తోట సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



సాదియా అల్‌మాస్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

వడ్రాణంకు సీఎం అభినందనలు



సీఎం చంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న డీసీఎంఎస్ ఛైర్మన్ హరిబాబునాయుడు, ఉద్భవ్

గుంటూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాకు ఈ దఫా అత్యధిక శాతం యూరియా, డీఏపీ ఎరువులు కేటాయింపులు చేయడంపై.. సీఎం చంద్రబాబునాయుడుకు జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు నాయుడు కృతజ్ఞతలు తెలియజేశారు. వెలగపూడి సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రిని హరిబాబు ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా రైతు సోదరులకు అండగా నిలిచేందుకు డీసీఎంఎస్ ద్వారా చేపడుతున్న పలు అభివృద్ధి పనుల గురించి వివరించారు. దీనిపై సీఎం స్పందిస్తూ ఇదే ఉత్సాహాన్ని కొనసాగిస్తూ తెలుగుదేశం పార్టీని, ప్రభుత్వ అభివృద్ధి పథకాలను ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం వడ్రాణం ఉద్భవ్ నాయుడు చేతుల మీదుగా ముఖ్యమంత్రికి జ్ఞాపికను హరిబాబు అందజేశారు.

26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు



సాగర్ జలాశయానికి భారీ వరద

26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. మంగళవారం శ్రీశైలం నుంచి 4,10,186 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 584.60 అడుగులు ఉంది. ఇది 296.28 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7,528, ఎడమ కాలువ ద్వారా 4,949, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,007, 26 క్రస్ట్ గేట్లను 10 అడుగులు మేర ఎత్తి 3,61,322 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 4,09,506 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

19 గేట్లు ఎత్తి..

రెంటచింతల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఎగువన ఎడతెరిపి లేని వర్షాలతో కృష్ణమ్మ పరవళ్ల తొక్కుతుంది. సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు 20 రేడియల్ క్రస్ట్ గేట్లలో.. మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు 19 క్రస్ట్ గేట్లను ఎత్తినట్లు ఎస్‌ఈ వెంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం చెప్పారు. 16 క్రస్ట్ గేట్లను 4 మీటర్లు, 3 క్రస్ట్‌గేట్లను 5 మీటర్ల మేర ఎత్తి 4,03,281 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి వచ్చే నీటిని వచ్చినట్లు విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్‌లో 74.20 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.213 టీఎంసీలకు సమానం.. విద్యుదుత్పత్తిని పూర్తిగా నిలిపి వేశారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 33.75 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 3,98,087 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా నాలుగు వందల, 15 గేట్ల ద్వారా 4,16,467, మొత్తం 4,33,467 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.



సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్‌లో 19 రేడియల్ క్రస్ట్ గేట్ల నుంచి జాలువారుతున్న కృష్ణమ్మ

చర్లపల్లి- తిరువారూర్ ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వేళాంగిణి మేరీ మాత పండగ రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా చర్లపల్లి - తిరువారూర్ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు డీఆర్ఎం సుధేష్ణ సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు 07091 రైలు ఈ నెల 27, సెప్టెంబరు 8న ఉదయం 8.10కి బయలుదేరి 10.28కి నడికుడి, 10.58కి పిడుగురాళ్ల, 11.43కి సత్తెనపల్లి, మధ్యాహ్నం ఒంటి గంటకు గుంటూరు, 2 గంటలకు తెనాలికి చేరుకుంటుంది. మరుసటి రోజు ఉదయం 10.30కి తిరువారూర్ చేరుకొంటుంది. నంబరు 07092 రైలు ఈ నెల 28, సెప్టెంబరు 9వ తేదీల్లో రాత్రి 10.35కి బయలుదేరుతుంది. రెండో రోజున సాయంత్రం 5.28కి తెనాలి, 6.45కి గుంటూరు, రాత్రి 7.38కి సత్తెనపల్లి, 8.38కి పిడుగురాళ్ల, 9.28కి నడికుడి, రాత్రి 1.30కి చర్లపల్లి చేరుకొంటుందన్నారు.

అక్టోబరులో ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రద్దు

మూడో రైలుమార్గం నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా అక్టోబరు 14 నుంచి 18వ తేదీ వరకు సికింద్రాబాద్ - గుంటూరు - సికింద్రాబాద్(వయా వరంగల్, కాజీపేట) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ని పూర్తిగా రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు - సికింద్రాబాద్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ అక్టోబరు 14 నుంచి 18వ తేదీ వరకు గుంటూరు - కాజీపేట మధ్యన రద్దు చేసి.. కాజీపేట - సికింద్రాబాద్ మధ్యన నడుపుతామన్నారు. 17202 సికింద్రాబాద్ - గుంటూరు గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ని అక్టోబరు 13 నుంచి 17వ తేదీ వరకు కాజీపేట వరకే నడిపి నిలిపేయనున్నట్లు పేర్కొన్నారు. కోణార్క్, ఈస్టు కోస్టు, సాయినగర్ షిర్డీ - కాకినాడ, విశాఖపట్టణం - ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లను గుంటూరు మీదగా దారి మళ్లించనున్నట్లు తెలిపారు.

అర్హులైన దివ్యాంగ పెన్షనర్లకు మరో అవకాశం: కమిషనర్ శ్రీహరిబాబు

చిలకలూరిపేట, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల పెన్షన్ల వెరిఫికేషన్‌ను చేపట్టిందని, అంగవైకల్యం ఉన్నవారు మరలా అప్పీల్ చేసుకోవచ్చునని చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు మంగళవారం తెలిపారు. చిలకలూరిపేట పురపాలక సంఘంలో 255మంది లబ్ధిదారులు అనర్హులుగా తేలారన్నారు. వారిలో అర్హులుంటే వారి పింఛను పునరుద్ధరించడం జరుగుతుందన్నారు. అప్పీల్ చేసుకున్న వారి దరఖాస్తులను పీడీడీఆర్‌డీఏకు పంపిస్తామని, అక్కడ నుంచి డీఎంహెచ్‌వోకు పంపిస్తారని, అనంతరం నోటీసు జారీ చేసి, డాక్టర్ల బృందంతో మరోసారి తనిఖీ చేయిస్తారని వివరించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

రౌడీ షీటర్ల ఇళ్లను పరిశీలించిన ఎస్ఐ

నాదెండ్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా రౌడీ షీటర్ల ఇళ్లను పరిశీలించే కార్యక్రమాన్ని మంగళవారం నాదెండ్ల పోలీసులు ప్రారంభించారు. గణపవరం గ్రామంలోని రాజీవ్‌గాంధీ కాలనీలో షేక్ ఖాశిం సాయి ఇంటిని ఎస్ఐ పుల్లారావు సందర్శించారు. ఆ ప్రాంతంలో ఉన్న వారిని ఖాశిం ప్రవర్తనపై ఆరా తీశారు. క్రమశిక్షణగా మెలగకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

యడ్లపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ అశోక్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ లైన్ల మరమ్మతులు, కొత్త లైన్ల ఏర్పాటుపనుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. మండలంలోని యడ్లపాడు, జాలాది, జగ్గాపురం, కారుచోల, ఉప్పరపాలెం, సంగంగోపాలపురం, మైదవోలు గ్రామాలకు సరఫరా నిలిపివేయబడుతుందన్నారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

ఈపూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మరాజుపల్లి గ్రామంలో కల్యాణ వెంకటేశ్వరస్వామి వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. సందర్భంగా స్వామివారికి అభిషేకం, ఉత్సవ మూర్తులకు శాంతి కల్యాణం జరిపించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కె.ఎర్రయ్య దంపతులు స్వామివారికి అభిషేకాలు చేశారు.

చర్చిని సందర్శించిన ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

నాదెండ్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నాదెండ్ల, చైతన్య నగర్‌లో నూతనంగా నిర్మించిన ఏపీ పానియా లూథరన్ దేవాలయాన్ని శాసన మండలి సభ్యుడు మర్రి రాజశేఖర్ మంగళవారం సందర్శించారు. సుమారు రూ.2కోట్ల వ్యయంతో ఈ చర్చిని సుందరంగా నిర్మించారు. చర్చిని సందర్శించిన రాజశేఖర్‌కు సంఘ పెద్దలు, సంఘకాపరి తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పెద్దలు రాజశేఖర్‌కు సంఘ పెద్దలు చర్చి నిర్మాణాన్ని దాతల సహకారంతో పూర్తి చేసిన విషయాన్ని వివరించారు. ఒక్కొక్క కుటుంబం రూ.40 చొప్పున తమ వంతుగా విరాళం అందజేసిందని వివరించారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

● సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి

వినుకొండ టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని, ఆగస్టు 23న ఒంగోలులో జరిగే ప్రదర్శనలో, బహిరంగ సభలో వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వినుకొండ శివయ్య భవనంలో సీపీఐ 28వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టరును విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 23, 24, 25 తేదీలలో ఒంగోలు నగరంలో సీపీఐ రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని ప్రారంభం రోజున ఆగస్టు 23వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా మహాసభలకు విచ్చేసే పార్టీ శ్రేణులు ప్రజా సంఘాలు నగరంలో ర్యాలీని నిర్వహించనున్నాయన్నారు. అనంతరం బహిరంగ సభ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, మాజీ వైస్ చైర్మన్ సంద్రపాటి సైదా, పట్టణ కార్యదర్శి పఠాన్ లాల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితికి పోలీసుల సూచనలు

చిలకలూరిపేట, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట పట్టణంలో, రూరల్ సర్కిల్‌లో ప్రజలకు వినాయక చవితి వేడుకల సందర్భంగా విగ్రహాల ఏర్పాటుపై అర్బన్ సీఐ పి.రమేష్, రూరల్ సీఐ బి.సుబ్బనాయుడు మంగళవారం పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ ఈ నియమాలను పాటించడం ద్వారా వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా జరుపుకోవాలని వారు కోరారు. గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసే ముందు పోలీస్ శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని తెలిపారు. అనుమతి పత్రంలో విగ్రహం ఏర్పాటు చేసే స్థలం, నిమజ్జన సమయం, నిమజ్జన ప్రదేశం, ఊరేగింపు మార్గాన్ని (రూట్ మ్యాప్) స్పష్టంగా పేర్కొనాలన్నారు. నిమజ్జనానికి ఉపయోగించే వాహనం వివరాలను కూడా ముందుగానే తెలపాలని కోరారు. మైక్ వినియోగాన్ని కేవలం పూజా సమయానికే పరిమితం చేయాలని అన్నారు. ఊరేగింపుల వంటి కార్యక్రమాలకు ముందుగా అనుమతి తీసుకోవాలని సూచించారు. విద్యుత్ వినియోగానికి సంబంధించిన అనుమతులను విద్యుత్ శాఖ నుంచి తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు.

అట్టహాసంగా కిసాన్ మేళా


కిసాన్ మేళాలో ప్రసంగిస్తున్న జీవీ ఆంజనేయులు


మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న వినుకొండ, ఈపూరు మార్కెట్ యార్డు పాలకవర్గ సభ్యులు

వినుకొండ టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన మెగా కిసాన్ మేళా కార్యక్రమం మంగళవారం అట్టహాసంగా జరిగింది. చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పిలుపుమేరకు రైతులు ట్రాక్టర్లతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా ఎన్ఎస్‌పీ కాలనీ నుంచి ఏర్పాటు చేసిన ర్యాలీలో సుమారు 400 ట్రాక్టర్లతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, మాజీ మంత్రి, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణతో కలిసి శివయ్య స్తూపం మీదుగా మార్కెట్‌యార్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. జీవీ ఆంజనేయులు సూచనలు, కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాలతో జిల్లా వ్యవసాయ శాఖ, హార్టికల్చర్ అధికారులు వారం రోజులుగా శ్రమించి యార్డులో రైతులకు ఉపయోగపడే విధంగా 150 కంపెనీల యజమానులతో కలిసి స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ స్టాల్స్‌ను మంత్రి అచ్చెన్నాయుడు ప్రారంభించారు. అనంతరం సభా వేదిక వద్ద తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామరావు విగ్రహానికి నివాళులర్పించారు. ముందుగా నూతనంగా వినుకొండ మార్కెట్ యార్డు చైర్మన్‌గా ఎంపికైన మీసాల మురళీకృష్ణ యాదవ్, వైస్‌చైర్మన్ కాళంగి శ్రీనివాసరావులతో పాటు ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ లక్ష్మీబాయి, వైస్ చైర్మన్ గోరంట్ల సత్యనారాయణతో పాటు ఆయా యార్డుల డైరెక్టర్లతో మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ పండ్లతోటల పెంపకం వల్ల రైతుల తలసరి ఆదాయాన్ని పెంచుకోవచ్చన్నారు. పల్నాడు ప్రాంతంలో పామాయిల్ తోటలకు అనుకూలంగా ఉందని, పామాయిల్ తోటల పెంపకం ద్వారా రైతుకు సంవత్సరానికి రూ.1.50లక్షలు కౌలు వస్తుందన్నారు. వినుకొండ ప్రాంతానికి వెటర్నరీ కాలనీని మంజూరు చేయాలని, అదేవిధంగా ఆక్వా రైతులకు సబ్సిడీలు కల్పించాలని, హార్టికల్చర్ పరికరాలు అందించాలంటూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును కోరారు. అనంతరం సుమారు 15వేల మంది రైతులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కలెక్టర్ అరుణ్‌బాబు, ఆర్డీవో మధులత, శావల్యాపురం జడ్పీటీసీ పారా హైమావతి, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశికుమార్, గురప్పనాయుడుపాలెం సొసైటీ అధ్యక్షుడు ముండ్రు సుబ్బారావు, జనసేన నాయకులు నిశ్శంకర శ్రీనివాసరావు, కొంజేటి నాగశ్రీను, బీజేపీ నాయకులు మేడం రమేష్, హార్టికల్చర్, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

వైసీపీ కార్యకర్తలు తస్మాత్ జాగ్రత్త: మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి

వినుకొండ టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జగన్ జైలుకుపోతే పెట్రోల్ పోయించి వెనుక నుంచి అగ్గిపుల్ల ముట్టిస్తారు తస్మాత్ జాగ్రత్త అంటూ మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి వైసీపీ కార్యకర్తలను సూచించారు. వినుకొండ మార్కెట్ యార్డులో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిసాన్‌మేళా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన రైతులతో మాట్లాడుతూ జగన్ వ్యవహార శైలిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో పనిచేసిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం లభిస్తుందని, అందుకు నిదర్శనమే వినుకొండ మార్కెట్ యార్డు బీసీకి, ఈపూరు మార్కెట్‌యార్డు ఎస్సీకి లభించిందన్నారు. సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వినుకొండలో ఆంజనేయులు ఏర్పాటు చేసిన ట్రాక్టర్ ర్యాలీ ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడా జరిగి ఉండలేదన్నారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ జీడీసీసీబీ ద్వారా రైతులకు పావలా, 30పైసలకు రుణాలు ఇస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైతులు ఆదాయం పెంచుకునేందుకు స్టాల్స్‌లో అవగాహన: కలెక్టర్

జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ రైతులు ఆదాయం పెంచుకునేందుకు హార్టికల్చర్, అగ్రికల్చర్ ఆధ్వర్యంలో 100కు పైగా స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ అందుబాటులో ఉన్నాయన్నారు. రెండు రోజుల పాటు ఈ కిసాన్ మేళా స్టాల్స్ అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు.

● బొల్లాపల్లి: వినుకొండ నియోజకవర్గంలో జరిగిన మెగా కిసాన్ సమ్మేళనానికి బొల్లాపల్లి మండలం నుంచి రైతులు భారీ ఎత్తున తరలివెళ్ళారు.


కిసాన్ మేళాలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

కోలాహలంగా మార్కెట్ యార్డు చైర్మన్‌ల ప్రమాణ స్వీకారోత్సవం



ర్యాలీలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు, నరసరావుపేట, రొంపిచర్ల మార్కెట్‌యార్డు చైర్మన్‌లను సత్కరిస్తున్న అచ్చెన్నాయుడు

నరసరావుపేట రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట, రొంపిచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల ప్రమాణ స్వీకార మహోత్సవం మంగళవారం కోలాహలంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెంన్నాయుడు పాల్గొన్నారు. తొలుత వినుకొండ నుంచి నరసరావుపేటకు విచ్చేస్తున్న మంత్రికి నరసరావుపేట మండలం ఉప్పలపాడు వద్ద రైతులు ఘనస్వాగతం పలికారు. ఉప్పలపాడు నుంచి రైతులు బారీ సంఖ్యలో ట్రాక్టర్లతో ర్యాలీగా టౌన్ హాలుకు చేరుకున్నారు. అనంతరం నరసరావుపేట మార్కెట్ యార్డు చైర్మన్‌గా పూనాటి శ్రీనివాసరావు, సభ్యులతో, రొంపిచెర్ల మార్కెట్ యార్డు చైర్మన్‌గా మొండితోక రాణి రామారావు, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉంటే ప్రజలకు సేవ చేస్తుందని, ప్రతి పక్షంలో ఉంటే ప్రజల పక్షాన పోరాడుతుందని అన్నారు. రాష్ట్రంలో బీసీలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందన్నారు.

గ్రామ స్వరాజ్యం నేడు సాకారం: వర్ల రామయ్య

మహాత్మా గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం నేడు సాకారం అయిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీలందరూ చంద్రబాబు నాయుడుకి రుణపడి ఉండాలన్నారు. గడిచిన ఐదేళ్ళలో ఎస్సీలను వైసీపీ ప్రభుత్వం అనగదొక్కిందన్నారు. రొంపిచర్ల మార్కెట్‌యార్డు చైర్మన్‌గా ఒక ఎస్సీ వర్గానికి చెందిన మహిళను నియమించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే అరవిందబాబు

రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. కార్యక్రమంలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, జనసేన నాయకులు సయ్యద్ జిలాని, వంశీ, బీజేపీ నాయకులు రంగిశెట్టి రామకృష్ణ, కడియాల వెంకటేశ్వరరావు, నల్లపాటి రాము, కడియాల రమేష్, వేల్పుల సింహాద్రి యాదవ్, నాగసరపు సుబ్బరాయగుప్తా, విశ్వేశ్వరరావు, కొల్లి బ్రహ్మయ్య, పులిమి రామిరెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించాలి

● విద్యుత్ అదాలత్‌లో విశ్రాంత జిల్లా న్యాయమూర్తి ఇమ్మానియేల్


చిలకలూరిపేటలో జరిగిన విద్యుత్ అదాలత్‌లో వినియోగదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న విక్టర్ ఇమ్మానియేల్

చిలకలూరిపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించాలని విద్యుత్ అధికారులు, సిబ్బందిని విశ్రాంత జిల్లా న్యాయమూర్తి, విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్‌పర్సన్ ఎన్.విక్టర్ ఇమ్మానియేల్ మంగళవారం కోరారు. పట్టణంలో జరిగిన విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ శాఖలోని అన్ని విభాగాల వారు సమష్టిగా పని చేయాలన్నారు. అనంతరం అదాలత్‌కు అధ్యక్షత వహించిన విక్టర్ ఇమ్మానియేలు ఫోరం సభ్యులైన సీఆర్‌డీఏ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ ఎమ్.శ్రీనివాసరావు, సాంకేతిక సభ్యుడు ఎస్.శ్రీనివాస్, స్వాతంత్ర్య సభ్యురాలు ఏ సునీత, గణాంక అధికారి అజయ్ కుమార్ లతో కలిసి వినియోగదారుల నుంచి సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించారు. పల్నాడు జిల్లా వినియోగదారుల ఫోరమ్ అధ్యక్షుడు మురికిపూడి ప్రసాదరావు చిలకలూరిపేటలో రెండో బిల్లు కౌంటర్ ఏర్పాటుచేయాలని, పట్టణంలో పలు ప్రాంతాలలో లో ఓల్టేజి సమస్యలు పరిష్కరించాలని, వినియోగదారుడి అనుమతి ఉంటేనే స్మార్ట్ మీటర్ బిగించాలని, కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందచేశారు. చిలకలూరిపేటలో ఎమర్జెన్సీ కాల్స్‌కు స్పందన ఉండడంలేదని ఫిర్యాదు చేశారు. విద్యుత్ అదాలత్‌లో మొత్తం 12 సమస్యలు ఫోరం దృష్టికి రాగా వాటిలో 3 సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మరో 9 సమస్యలను వారంలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ అదాలత్‌లో చిలకలూరిపేట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.ఏడుకొండలు, ఇద్దరు డీఈలు, 9మంది ఈఈలు పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో రీ సర్వే

నూజెండ్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తలార్లపల్లి, నూజెండ్ల, కొండ్రప్రోలు, ముక్కెళ్ళపాడు గ్రామాల్లో మూడో దశలో రీ సర్వే పనులు ప్రారంభమైనట్టు మండల సర్వేయర్ చండీ రాణి మంగళవారం తెలిపారు. మండలంలో 20 రెవెన్యూ గ్రామాలు ఉండగా మొదటి, రెండో ఫేజ్‌లో 12గ్రామాలు పూర్తి కాగా మిగిలిన నాలుగు గ్రామాలైన ఐనవోలు, పచ్చనూతల, వీ అప్పాపురం, తిమ్మాపురం గ్రామాలను నాలుగో దశలో పూర్తి చేస్తామన్నారు. మూడో విడత రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో మొదట గ్రామ సరిహద్దులు నిర్ధారించి ప్రభుత్వ భూములను గుర్తించి అనంతరం రైతుల పొలాలను సర్వే చేశామన్నారు. రీ సర్వే ద్వారా రైతుల భూములకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, గ్రామాల్లో రీ సర్వేకు రైతులు రెవెన్యూ సర్వే అధికారులకు సహకరించి త్వరితగతిన పూర్తయ్యేందుకు సహకరించాలన్నారు. సర్వే రెవెన్యూ అధికారులు, సిబ్బందితో మూడు బృందాలుగా ఏర్పాటుచేసి రోవర్ ద్వారా సర్వే చేస్తున్నట్టు మండల సర్వేయర్ చండీరాణి తెలియజేశారు.

వినుకొండలో ఫొటోగ్రఫీ దినోత్సవం

వినుకొండ టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లాయర్స్ స్ట్రీట్‌లోని ఎస్ఆర్ కలర్ ల్యాబ్‌లో 186వ ప్రపంచ ఛాయాచిత్ర దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినుకొండ ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేసనపల్లి సుబ్బారావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫొటోగ్రాఫర్లను ఏకం చేయడానికి మరింత మందిని ప్రోత్సహించే లక్ష్యంతో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం ప్రతి సంవత్సరం ఆగస్టు 19న జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు యార్లగడ్డ బుజ్జి, శ్యామ్, శ్రీనివాస్, బ్రహ్మం, సీపీ, కన్నయ్యలతో పాటు అధిక సంఖ్యలో వీడియో గ్రాఫర్లు ఫొటోగ్రాఫర్స్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

రొంపిచర్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈవో బ్రహ్మేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. నాణ్యమైన భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు.

కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో శిక్షణపై ఒప్పందం

నరసరావుపేట టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో టీఎంఐ గ్రూప్ వారితో సీఎస్ఆర్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ప్రోగ్రాం పరస్పర ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఈ పరస్పర ఒప్పంద పత్రాన్ని టీఎంఐ సంస్థ హైదరాబాద్ సీనియర్ మేనేజర్ ఎస్‌కే ఇమ్రాన్, కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఈ పరస్పర ఒప్పందంలో విద్యార్థులకు కావలసిన టెక్నికల్ స్కిల్స్ ట్రైనింగ్ అయిన జావా, పవర్-బీ, జెనరేటివ్ ఏఐ-డిజిటల్ మార్కెటింగ్, బ్యాంకింగ్ మొదలైన వాటిపై ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించి విద్యార్థులకు పలు ఎంఎన్‌సీ కంపెనీలలో ఉపాధి కల్పిస్తారు. ట్రైనింగ్‌తో పాటు ప్లేస్మెంట్స్‌ని కూడా అందజేస్తారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, టీపీవో ఎం బాలకోటేశ్వరరావు, అకాడమిక్ డైరెక్టర్ వై యోగేశ్వరరావు పాల్గొన్నారు.

కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

● సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణ

యడ్లపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం రూ.20వేలు దశల వారీగా కాకుండా ఒకే విడతలో అందించాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. రైతు సమస్యల పరిష్కారానికై ఈ నెల 25న నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని జగ్గాపురం, జాలాది, సందెపూడి, తుర్లపాడు, కారుచోల, వంకాయలపాడు, ఉన్నవ, యడ్లపాడు, మైదవోలు, సొలస గ్రామాలలో మంగళవారం ప్రచార యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కింద భూమిలేని కౌలు రైతులకు ఒకేసారి పెట్టుబడి సాయం మొత్తాన్ని అందించి ఆదుకోవాలన్నారు. భూ యజమానితో సంబంధం లేకుండా గ్రామసభల ద్వారా కౌలు రైతులను గుర్తించి హక్కు పత్రాలను మంజూరు చేయాలన్నారు. కలెక్టర్ కార్యాలయాల వద్ద నిర్వహించే ధర్నాలో రైతులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రచార యాత్రలో రైతు సంఘం నాయకులు శ్రీను, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

యడ్లపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పదహారో నంబరు జాతీయ రహదారిపై యడ్లపాడు ఎర్రకొండ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామానికి చెందిన విన్నకోట వెంకటమోహనరావు (52) టాటా ఏస్ వాహనం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం చిలకలూరిపేట నుంచి సెంట్రింగ్ సామాను తీసుకుని గుంటూరుకు వస్తుండగా యడ్లపాడు ఎర్రకొండ సమీపంలో టాటా ఏస్ వాహనం రోడ్డుపై నిలిచిపోయింది. దీంతో వాహనాన్ని పక్కకు జరిపేందుకు వెనుక నుంచి తోస్తుండగా చిలకలూరిపేట నుంచి గుంటూరువైపు వెళుతున్న స్కూటీ మోహనరావును ఢీకొట్టడంతో రోడ్డుపైపడి తీవ్రంగా గాయపడ్డాడు. సహచరులు మోహనరావును స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం అక్కడి వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్సకోసం గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మోహనరావు మృతిచెందాడు. కాగా ప్రమాదానికి కారణమైన వ్యక్తి స్కూటీని అక్కడే వదిలి పారిపోయాడు. మృతుని కుమారుడు హరికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు.


అవార్డు పొందిన చిత్రం , ఇన్‌సెట్‌లో ఫొటోగ్రాఫర్ సుబ్బారావు

ఫొటోగ్రాఫర్ కేసానుపల్లి సుబ్బారావుకు అవార్డు

వినుకొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): 186వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా డాక్టర్ ఎన్.భగవాన్‌దాస్, బండి రాజన్‌బాబు మెమోరియల్ ఫొటోగ్రఫీ కాంపిటేషన్ 2025 ఫొటోజెనిక్ ఆర్ట్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలో వినుకొండ ఫొటోగ్రాఫర్ కేసనపల్లి సుబ్బారావు నలుపు తెలుపు ఒక విభాగంలో 'బుల్ కాంపిటేషన్' ఫొటోకు సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్ అవార్డు దక్కింది. ఫొటో జనిక్ ఆర్ట్ సర్కిల్ సెక్రటరీ కానల సుధాకర్‌రెడ్డి దీనిపై సమాచారం ఇచ్చినట్లు సుబ్బారావు వివరించారు.

దుర్మార్గ విధానాల వల్లే మోదీ గెలుపు

● ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి

నరసరావుపేట టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎలక్షన్ కమిషన్, నరేంద్ర మోడీ దుర్మార్గ విధానాల వల్లే గెలుస్తున్నారని ప్రజలముందు రాహుల్‌గాంధీ ఆధారాలు పెట్టారని రాష్ట్ర ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి అన్నారు. మంగళవారం నరసరావుపేటలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అలెగ్జాండర్ సుధాకర్ ఆధ్వర్యంలో పట్టణంలో కాగడాల ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా షేక్ మస్తాన్ వలి మాట్లాడుతూ ఈ విషయమై ప్రధాని మంత్రి నోరువిప్పటం లేదని, పార్లమెంట్ సాక్షిగా సమాధానం చెప్పటం లేదన్నారు. ప్రధాన మంత్రి సమాధానం చెప్పి సుప్రీమ్ కోర్టు ప్రధాన న్యాయమూర్తితో విచారణ కమిటీ వేయించాలని ఈ కాగడాల ప్రదర్శన చేపట్టామన్నారు. రాహుల్ గాంధీ అడిగిన ఏ ప్రశ్నకూ సమాధానం చెప్పటం లేదన్నారు. ఈ ఎన్నికల తంతు మీద అధికారంలో ఉన్న చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, ప్రతిపక్షంలో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి నోరువిప్పాలన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మదన్‌మోహన్‌రెడ్డి, చిలకలూరిపేట, వినుకొండ, మాచర్ల సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిలు మద్దూరి రాధాకృష్ణ, బోయపాటి రామాంజనేయులు, రామచంద్రారెడ్డి, చుక్కా చంద్రపాల్, పల్నాడు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంటా గోపి, ఎస్ఎం భాష, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు నాగూర్ తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ శిబిరంలో పాల్గొన్న సీపీఐ నాయకులు

ప్రజా సేవలో జన సేవాదళ్

వినుకొండటౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలోని అజాద్ నగర్ కాలనీలో జరిగిన జనసేవాదళ్ శిక్షణ శిబిరాన్ని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేవాదళ్ ప్రజారక్షణలోనూ దేశంలో మత కలహాలు సంభవించినప్పుడు మతోన్మాదుల బారి నుంచి మైనారిటీలను, దేశంలో వరదలు తుఫానులు ఉప్పెనలు అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు ప్రజా సేవ చేసిన చరిత్ర జన సేవాదళ్‌కు ఉందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సంద్రపాటి సైదా, పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహంకాళి సుబ్బారావు, మండల కార్యదర్శులు పిన్నబోయిన వెంకటేశ్వర్లు, కే మల్లికార్జున, కె.సుభాని, షేక్ కిషోర్, ఏఐవైఎఫ్ నాయకులు మరియబాబు, షేక్ మస్తాను, వెంకటేశ్వర్లు, స్కైలాబ్, రమణ, లక్ష్మి, దేవమ్మ కార్యకర్తలు ఎక్కువ సంఖ్యలో శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు.

27మంది దివ్యాంగ పింఛన్ల నిలిపివేత

శావల్యాపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 11 సచివాలయాల పరిధిలో అర్హత లేకుండానే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పొందుతున్న 27మంది దివ్యాంగ పింఛన్లను ప్రభుత్వం నిలుపుదల చేసిందని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2 పెరాలసిస్, 25 దివ్యాంగ పింఛన్లను ప్రభుత్వం నిలిపివేసినట్లు తెలిపారు. 27మందికి నోటీసులు అందజేశామని, ఎవరైనా అభ్యంతరాలుంటే వారంరోజుల్లోపు పునఃపరిశీలన కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వీటితోపాటు మండలంలోని 11 సచివాలయాల పరిధిలో పెరాలసిస్ పింఛన్లను పొందుతున్న మరో 17మందిలో 13మందివి, 60ఏళ్ళు పైబడిన 4గురివి వృద్ధాప్య పింఛన్లుగా ప్రభుత్వం బదిలీ చేసిందన్నారు.

బొల్లాపల్లి మండలంలో 153...

బొల్లాపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 33 పంచాయతీల పరిధిలో సెర్ప్ ఆదేశాల మేరకు వివిధ క్యాటగిరిలో దివ్యాంగ సర్టిఫికెట్లు పొంది పింఛన్లు పొందుతున్న అనర్హులను 153మందిని తొలగించినట్టు ఎంపీడీవో పీ సీతారామయ్య మంగళవారం తెలిపారు. వీరిలో 151 డిజేబుల్, రెండు పెరాలసిస్ అనర్హులుగా ప్రకటించారని, వీరిలో ఎవరైనా అప్పీలుకు వెళ్ళాలనుకున్నా, ఫిర్యాదు చేయాలనుకున్నా పాత సదరం సర్టిఫికెట్, నోటీసును తీసుకొని జీజీహెచ్ లేదా ఆస్పత్రికి వెళ్ళి వైద్యునితో తనిఖీ చేయించుకొని సర్టిఫికెట్ పొందాలన్నారు. మరలా ఎంపీడీవో కార్యాలయంలో అప్పీలు చేసుకోవచ్చన్నారు. నోటీసు అందిన 30రోజుల్లో మాత్రమే చేసుకోవాలన్నారు.

కబడ్డీ జట్టుకు అభినందనలు

ఈపూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ ఉద్యోగులకు అల్లూరి సీతారామరాజు జిల్లా అప్పర్ సీలేరులో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో పల్నాడు జిల్లా జట్టు ప్రథమ బహుమతి సాధించింది. ఆ జట్టులో ఈపూరు మండలం విద్యుత్ ఉద్యోగులు ఉన్నారు. వారిని ఎస్ఈ ప్రత్తిపాటి విజయ్ కుమార్, ఈఈ రాంబొట్లు, డీఈఈ బీ వెంకటేశ్వరరెడ్డి, ఏఈ ఎస్ గాంధీబాబులు అభినందించారు.